


# అనంత జనశక్తి

జనం కోసమే మా అక్షరం

29.08.2026
శనివారం |రంగారెడ్డి
సంపుటి : 01 | సంచిక: 60
పేజీలు : 08 | వెల: రూ.5

AJS అనంత జనశక్తి జనం కోసమే మా అక్షరం

PUBLISHED BY ANANTAPUR, KADAPA, CHITTOR, VISAKHAPATNAM, SRIKAKULAM, EALLURU, TIRUPATHI, ONGOLE, VIJAYAWADA, NELLORE, PRAKASHAM, GUNTUR, KURNOOL.


## చిన్నారులతో మోదీ రాఖీ వేడుకలు




న్యూఢిల్లీ, ఆగస్ట్ 28, అనంతజనశక్తి న్యూస్

రక్షాబంధన్ పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశ ప్రజలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ పండుగ ప్రజల మధ్య సోదరభావం, ఆప్యాయత, సామరస్య బంధాలను మరింత బలోపేతం చేయాలని ఆయన ఆకాంక్షించారు. ప్రతి ఒక్కరి జీవితంలో సుఖశాంతులు, శ్రేయస్సు వెల్లివిరియాలని ప్రధాని మోదీ సందేశం ఇచ్చారు. మహిళల భద్రత, గౌరవానికి సమాజం ఎల్లప్పుడూ ప్రాధాన్యత ఇవ్వాలని గుర్తుచేశారు. న్యూఢిల్లీలోని 7, లోక్ కల్యాణ్ మార్గ్‌లో ఉన్న ప్రధాని అధికారిక నివాసంలో రాఖీ వేడుకలు అత్యంత ఉత్సాహంగా జరిగాయి. వివిధ పాఠశాలలకు చెందిన చిన్నారులు, విద్యార్థినులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ప్రధాని మోదీ చేతులకు రాఖీలు కట్టారు. ఈ సందర్భంగా ప్రధాని చిన్నారులతో ఎంతో ఆప్యాయంగా ముచ్చటించారు. పిల్లలకు హై-ఫైవ్స్ ఇస్తూ వారితో సరదాగా గడిపిన మధుర క్షణాలను ప్రధాని ప్రత్యేకంగా పంచుకున్నారు. 2లో..

## అమెరికా నుంచి 'జావెలిన్'

- ట్యాంక్ విధ్వంసక క్షిపణి వ్యవస్థ కొనుగోలు చేయనున్న భారత్
- లాక్‌హీడ్ మార్టిన్', 'ఆర్టీఎక్స్ సంయుక్తంగా తయారి



వాషింగ్టన్, ఆగస్ట్ 28,
అనంత జనశక్తి న్యూస్

యుద్ధంలో తన ప్రతిభను నిరూపించుకుని, ఒక్కరే మోసుకెళ్లగలిగే 'ఫైర్అండ్‌ఫర్గెట్' మీడియం రేంజ్ యాంటీ ట్యాంక్ విధ్వంసక ఆయుధ వ్యవస్థ జావెలిన్‌ను కొనుగోలుకు ప్రణాళికలు రచిస్తోందని అమెరికా రాయబారి సెర్గియో గోర్ తెలిపారు. న్యూఢిల్లీ, వాషింగ్టన్‌ల మధ్య రక్షణ సహకారాన్ని బలోపేతం చేసే చర్యలో భాగంగా, గత ఏడాది నవంబర్‌లో భారత్‌కు ఎఫ్‌జీఎం 148 జావెలిన్ ఆయుధ వ్యవస్థ విక్రయానికి అమెరికా విదేశాంగ శాఖ ఆమోదం తెలిపింది. 2లో..

# రాష్ట్ర ప్రయోజనాల కోసం గట్టిగా వాదించాలి

- సీఎం రేవంత్ రెడ్డి వెల్లడి
- అంతర్రాష్ట్ర జల వివాదాలపై సీఎం సమీక్ష
- ఉత్తమ్‌తో కలిసి నీటిపారుదల శాఖపై చర్చ
- తుమ్మిడిహట్టి భేటీ ఎజెండాపై సమీక్ష
- సీడబ్ల్యూసీ హైలెవెల్ కమిటీపై చర్చ
- మహారాష్ట్ర, ఏపీ వివాదాలపై తెలంగాణ వాదన
- సుప్రీంకోర్టు కేసుల పురోగతిపై ఆరా
- కృష్ణా, గోదావరి బోర్డు అంశాలపై చర్చ
- గ్రాండ్ చెస్ టూర్ విజేత ప్రజ్ఞానందకు అభినందనలు



హైదరాబాద్; ఆగస్ట్ 29,
అనంతజనశక్తి న్యూస్

అంతర్రాష్ట్ర జల వివాదాలకు సంబంధించి వివిధ వేదికలపై రాష్ట్ర ప్రయోజనాలు కాపాడేలా గట్టిగా వాదించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం చేశారు. మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో నీటిపారుదల శాఖపై మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డితో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. సెప్టెంబరు 1న తుమ్మిడిహట్టిపై దిల్లీలో జరగనున్న అధికారుల భేటీ, సెప్టెంబరు 7న సీడబ్ల్యూసీ హైలెవెల్ కమిటీ సమావేశ ఎజెండాపై ఈ సమీక్షలో చర్చించినట్లు సమాచారం. మహారాష్ట్ర, ఏపీతో వివాదాలపై అధికారులు, న్యాయవాదులు తెలంగాణ వైఖరిని స్పష్టం చేయాలని సీఎం సూచించినట్లు తెలుస్తోంది. సుప్రీంకోర్టు, కేంద్ర జలవనరుల సంఘం, కృష్ణా, గోదావరి నదీ జలాల నిర్వహణ బోర్డుల్లో ఉన్న వివిధ కేసులపై చర్చించారు. కేసులు ఏ దశలో ఉన్నాయి.. ఇతర రాష్ట్రాల వాదనలేంటి.. తెలంగాణ ప్రయోజనాలు వంటి అంశాలపై సీఎం ఆరాతీసినట్లు సమాచారం.

### ప్రజ్ఞానందకు అభినందనలు తెలిపిన సీఎం

అమెరికాలోని సెయింట్ లూయిస్‌లో జరిగిన గ్రాండ్ చెస్ టూర్ టైటిల్‌ను సొంతం చేసుకుని.. చరిత్ర సృష్టించిన భారత చెస్ గ్రాండ్ మాస్టర్ ఆర్. ప్రజ్ఞానందకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభినందనలు తెలిపారు. అంతర్జాతీయ వేదికలపై భారత ఖ్యాతిని మరోసారి ప్రపంచానికి చాటిచెప్పిన ప్రజ్ఞానంద విజయం ప్రతి పౌరుడు గర్వించదగ్గ విషయమని సీఎం పేర్కొన్నారు. ప్రజ్ఞానంద విజయం క్రీడాకారులకు, యువతీ యువకులకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందన్నారు. భవిష్యత్తులో ప్రజ్ఞానంద మరెన్నో అద్భుతమైన విజయాలు సాధించి, దేశానికి కీర్తి తీసుకురావాలని సీఎం ఆకాంక్షించారు.

## రేవంత్‌కు రాఖీ కట్టిన సురేఖ

- సీఎం రేవంత్ రెడ్డి నివాసంలో రాఖీ వేడుక
- రాష్ట్రానికి సుపరిపాలన అందించాలి 2లో..
- మంత్రి కొండా సురేఖ



హైదరాబాద్, ఆగస్ట్ 28,
అనంతజనశక్తి న్యూస్

రాఖీ పౌర్ణమి సందర్భంగా తెలంగాణ ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డికి జూబ్లీహిల్‌స్‌లోని ఆయన నివాసంలో మంత్రి కొండా సురేఖ, మరో మహిళా మంత్రి సీతక్క రక్షాబంధన్ కట్టారు. అనంతరం మంత్రి కొండా సురేఖ రాఖీ పండుగ ప్రాధాన్యతతో పాటు సీఎం రేవంత్ రెడ్డితో తన అనుబంధంపై మాట్లాడారు.

## సమస్యలను పరిష్కరిస్తాం

- పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం..
- బీజేపీ రాజమహేంద్రవరం ఎంపీ పురందేశ్వరి



అమరావతి, ఆగస్టు 28,
అనంతజనశక్తి న్యూస్

పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం అభివృద్ధికి కృషి చేస్తామని బీజేపీ రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి వ్యాఖ్యానించారు. ఈ విశ్వవిద్యాలయంలోని సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని మాటిచ్చారు. ఈ విశ్వ విద్యాలయం 30 ఎకరాల విస్తీర్ణంలో ఉందని వెల్లడించారు. 5లో..


## సురక్షితంగా స్వస్థలాలకు చేరుకున్న 21 మంది



5లో..

## తనిఖీలు చేయండి

- బాలాజీ యాక్షన్ బిల్డ్ వెల్ పరిశ్రమ కాలుష్యం
- కృష్ణంపాలెం గ్రామస్తుల ఫిర్యాదు
- స్పందించిన డిప్యూటీ సీఎం పవన్
- తనిఖీలు చేపట్టాలని పీసీబీకి ఆదేశాలు
- కలప వ్యర్థాలను ఇంధనంగా వినియోగిస్తున్నట్లు గుర్తింపు 5లో..



అనకాపల్లి, ఆగస్ట్ 28, అనంత జనశక్తి న్యూస్

అనకాపల్లి జిల్లాలోని రాంబిల్లి మండలం కృష్ణంపాలెం గ్రామస్థుల ఫిర్యాదుపై ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ రియాక్ట్ అయ్యారు. బాలాజీ యాక్షన్ బిల్డ్ వెల్ సంస్థ కార్యకలాపాల కారణంగా తమ గ్రామంలో తీవ్రమైన కాలుష్య సమస్యలు ఎదుర్కొంటున్నామని వారు సోషల్ మీడియా వేదికగా తమ మొరపెట్టుకున్నారు.

## వాతావరణం బాగుండాలంటే మొక్కలు పెంచాల్సిందే

- ఒక పెద్ద చెట్టు కొట్టేస్తే.. పది మొక్కలు నాటాలి!
- జనసేన ఎమ్మెల్సీ నాగబాబు
- ఏపీ గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ చైర్మన్‌గా బాధ్యతలు 2లో..

## ఒంగోలులో రూ.100 కోట్లతో రాడిసన్ హోటల్

- 5 స్టార్ హోటల్ నిర్మాణం 2లో..
- మంత్రి నారా లోకేష్ భూమిపూజ
- బిజినెస్ టూరిజం కోసం బ్యాంకెట్ హాళ్లు
- కాన్ఫరెన్స్ రూమ్‌లు ఏర్పాటు



ప్రకాశం, ఆగస్ట్ 28, అనంతజనశక్తి న్యూస్

ప్రకాశం జిల్లాలో పర్యటిస్తున్న మంత్రి నారా లోకేశ్ కీలక అభివృద్ధి ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టారు. ఒంగోలు సమీపంలోని నాగులుప్పలపాడు మండలం చదలవాడ గ్రామంలో రూ.100 కోట్ల పెట్టుబడితో నిర్మించనున్న అంతర్జాతీయ బ్రాండ్ రాడిసన్ 5 స్టార్ హోటల్‌కు భూమిపూజ, శంకుస్థాపన చేశారు.

## పెనం మీది నుంచి పొయ్యిలో పడ్డారు

- రాష్ట్ర ప్రజలంతా ఇదే అనుకుంటున్నారు
- కేసీఆర్ మాదిరిగానే రేవంత్ ఉన్నారు
- మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ 2లో..



## యూరియా సరఫరాలో ఇబ్బందులు లేవు

- మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు
- వ్యవసాయ యాంత్రీకరణ పథకంలో.. 2లో..
- పనిముట్లు ఖరారు చేశామని వెల్లడి



# చిన్నారులతో మోదీ రాఖీ వేడుకలు



(మొదటి పేజీ తరువాయి)

ఈ వేడుకల్లో ఢిల్లీలో చదువుతున్న తెలుగు విద్యార్థిని సాయి మధుమిత పాల్గొని అందరి దృష్టిని ఆకర్షించారు. ఢిల్లీ వ్యాప్తంగా ఉన్న పాఠశాలల నుంచి దాదాపు 100 మంది విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొనగా, అందులో హాజరైన ఏకైక తెలుగు అమ్మాయిగా సాయి మధుమిత నిలవడం విశేషం. సాయి మధుమిత ప్రస్తుతం ఢిల్లీ ప్రసాద్ నగర్‌లోని ఆంధ్ర ఎడ్యుకేషన్ సొసైటీకి చెందిన డాక్టర్ బి.వి. నాథ్, టి.ఆర్. రావు మెమోరియల్ సీనియర్ సెకండరీ స్కూల్‌లో 12వ తరగతి సైన్స్ చదువుతున్నారు. 202627 విద్యా సంవత్సరంలో ఉత్తమ ప్రతిభ కనబరుస్తున్న ఆమెకు ప్రధాని నివాసంలో జరిగిన రక్షాబంధన్ కార్యక్రమానికి వెళ్లే అవకాశం లభించింది.దేశ ప్రధానికి స్వయంగా రాఖీ కట్టే అరుదైన అవకాశం దక్కడం పట్ల సాయి మధుమిత అమితానందం వ్యక్తం చేశారు. ఇది తనకు జీవితాంతం గుర్తుండిపోయే గొప్ప అనుభూతిని అందించిందని ఆమె చెప్పారు. ప్రధాని మోదీ ఎంతో ప్రేమాభిమానాలతో తనను పలకరించి ఆశీర్వదించారని విద్యార్థిని సంతోషంగా వెల్లడించారు. తెలుగు పాఠశాల తరఫున వెళ్లి దేశ ప్రధానికి రాఖీ కట్టడంపై సాయి మధుమిత కుటుంబ సభ్యులతో పాటు పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు తీవ్ర హర్షం వ్యక్తం చేశారు. రాజధాని వేదికగా తెలుగు వారి ప్రతినిధిగా నిలిచిన సాయి మధుమితను పలువురు అభినందించారు.

# వాతావరణం బాగుండాలంటే మొక్కలు పెంచాల్సిందే

**అమరావతి, ఆగస్ట్ 28, అనంత జనశక్తి న్యూస్**



జనసేన ఎమ్మెల్సీ నాగబాబుకు ఏపీ ప్రభుత్వం ఏపీ గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ చైర్మన్ పదవిని ప్రకటించిన విషయం తెలిసిందే. ఇవాళ శ్రావణ పౌర్ణమి సందర్భంగా మంగళగిరి అరణ్య భవన్లోని చైర్మన్ ఛాంబర్ కో వేదమంత్రాల నడుమ వేదాశీర్వచనం అనంతరం నాగబాబు ఏపీ గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ చైర్మన్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించారు. తనకు ఈ బాధ్యతలు ఇచ్చిన డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, సీఎం చంద్రబాబు, ప్రధాని మోడీలకు హృదయపూర్వక నమస్కారాలు తెలియజేశారు. భవిష్యత్తులో వాతావరణం బాగుండాలంటే మొక్కలు పెంచాల్సిందే అని అన్నారు. ఒక పెద్ద చెట్టు కొట్టేస్తే.. పది మొక్కలు నాటాలి అనే విషయాన్ని అమలులోకి తెస్తాం అని నాగబాబు చెప్పారు.

'గ్రీనరీ మీద పవన్ కళ్యాణ్, నాకు చాలా ఇంటరెస్ట్ ఉంది. మేం చాలా చోట్ల చెట్లు నాటాం. చెట్లు నాటడం అనేది సొంతగా చేయడంతో పెద్దగా చేయలేకపోయాం. రాష్ట్రంలో గ్రీనరీ పెంచాలనే కోరిక నాకు ఉంది. నా జీవితాశయ గా ఉన్న గ్రీనరీ కళ్యాణ్ బాబుకి కూడా తెలుసు. భారతదేశంలో మొదటి గ్రీనరీ సంస్థ ఇదే. అడవులలోనే కాదు, రాష్ట్రం మొత్తంగా చూస్తే 29 శాతం మాత్రమే గ్రీనరీ ఉంది. గ్రీన్ కవర్ను 50 శాతంకు తీసుకురావాలనే టార్గెట్ ఉంది. అన్ని సంబధిత డిపార్ట్మెంట్లతో సమన్వయంతో పని చేయాలి. ప్రజలను గ్రీన్ మూవ్మెంట్గా దిశగా తీసుకెళ్ళాలని పవన్ కళ్యాణ్ ఆదేశించారు. జియోట్యాగింగ్, డ్రోన్స్ ద్వారా మొక్కల పెరుగుదలను పరిశీలిస్తాం. ఒక మొక్క జీవిత కాలంలో కోట్ల రూపాయల విలువ కలిగి ఉంటుంది' అని నాగబాబు తెలిపారు.

'భవిష్యత్తులో వాతావరణం బాగుండాలంటే మొక్కలు పెంచాల్సిందే. ఎంతో కొంత డ్యామేజీ జరగడం తప్పదు.. అలా జరగకుండా చూడాలంటే మొక్కలు కావాలి. భారతదేశంలో ప్రతీ బిడ్డకు ఆరోగ్యకర వాతావరణం ఇవ్వడానికి ఇదొక అవకాశం. మనం భూమాత వనరులను భవిష్యత్తు తరాల నుంచి అప్పు తీసుకున్నట్టు భావించాలి అనే ఆఫ్రికన్ సామెతను ఫాలో అవ్వాలి. ఒక పెద్ద చెట్టు కొట్టేస్తే పది మొక్కలు నాటాలి అనే విషయాన్ని అమలులోకి తెస్తాం. చారిత్రక విలువ ఉన్న చెట్లును వేరో చోటకు తరలిస్తాం' అని ఎమ్మెల్సీ నాగబాబు చెప్పారు.

# ఒంగోలులో రూ.100 కోట్లతో రాడిసన్ హోటల్

(మొదటి పేజీ తరువాయి)

రవిశంకర్ గ్రూప్, రవిప్రియ హాస్పిటాలిటీస్ ఎల్ఎల్‌పీ సంయుక్త భాగస్వామ్యంతో ఈ ఫైవ్ స్టార్ రాడిసన్ హోటల్ నిర్మాణం చేపట్టనున్నారు. ఒంగోలు పరిసర ప్రాంతాల్లో ఏర్పాటు కానున్న తొలి అంతర్జాతీయ బ్రాండెడ్ 5 స్టార్ హోటల్‌గా ఇది నిలవనుంది. అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా ఈ హోటల్‌ను అత్యాధునిక సౌకర్యాలతో నిర్మించనున్నారు.

మొత్తం 151 అల్ట్రా లగ్జరీ రూంలు ఈ హోటల్‌లో నిర్మించనున్నారు. మల్టీ క్యూసిన్ రెస్టారెంట్, ప్రీమియం బార్, లాంజ్, స్విమ్మింగ్ పూల్, స్పా, ఫిట్‌నెస్ సెంటర్ వంటి సదుపాయాలను ఏర్పాటు చేయనున్నారు. దీంతో ఒంగోలు నగరానికి, చుట్టుపక్కల ప్రాంతాలకు మరింత ఆధునిక వసతి సౌకర్యాలు అందుబాటులోకి రానున్నాయి. మరోవైపు బిజినెస్ టూరిజం, కార్యకలాపాలను ప్రోత్సహించేలా ప్రత్యేక ఏర్పాట్లు చేయనున్నారు.

2,100 చదరపు మీటర్లకు పైగా విస్తీర్ణంలో బ్యాంకెట్ హాళ్లు, కాన్ఫరెన్స్ రూమ్‌లను నిర్మించనున్నారు. దీంతో పారిశ్రామికవేత్తలు, వ్యాపార ప్రతినిధులు, వివిధ సంస్థల సమావేశాలకు అవసరమైన మౌలిక సదుపాయాలు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. నేషనల్ హైవే 16కు సమీపంలో ఈ హోటల్ నిర్మాణం చేపడుతుండటం కూడా ప్రాజెక్టుకు కీలకంగా మారనుంది. విజయవాడచెన్నై మార్గంలో ప్రయాణించే పర్యాటకులు, వ్యాపారవేత్తలు, పారిశ్రామికవేత్తలకు ఇది అందుబాటులో ఉండనుంది. హోటల్ అందుబాటులోకి వచ్చిన తర్వాత ఒంగోలు, పరిసర ప్రాంతాల్లో పర్యాటకం, హాస్పిటాలిటీ, రవాణా, సేవా రంగాలకు మరింత ఊతం లభించే అవకాశం ఉంది. మరీ ముఖ్యంగా స్థానిక యువతకు ఈ ప్రాజెక్టు ద్వారా ఉపాధి అవకాశాలు పెరగనున్నాయి. హోటల్ నిర్వహణతో పాటు టూరిజం, హాస్పిటాలిటీ, రవాణా, క్యాటరింగ్, ఇతర సేవా రంగాల్లో ప్రత్యక్ష, పరోక్ష ఉద్యోగాలు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. దీంతో ఒంగోలు జిల్లాలో సేవా రంగం విస్తరించేందుకు ఈ ప్రాజెక్టు దోహదపడుతుందని భావిస్తున్నారు.

ఇదిలా ఉండగా మంత్రి నారా లోకేశ్ ప్రకాశం జిల్లా పర్యటనకు టీడీపీ శ్రేణులు ఘన స్వాగతం పలికాయి. ఒంగోలు మున్సిపాలిటీ ఏర్పడి 150 ఏళ్లు పూర్తి అయిన సందర్భంగా నగరంతో ప్రత్యేక అనుబంధం ఉన్న పలువురు ప్రముఖుల విగ్రహాలను కూడా మంత్రి నారా లోకేశ్ ఆవిష్కరించారు. ఆ తర్వాత పార్టీ కార్యకర్తలు, అభిమానులతో ఆత్మీయంగా మమేకమయ్యారు. పలువురితో ఫొటోలు దిగడంతో పాటు వారి నుంచి వినతులను స్వీకరించారు. రక్షాబంధన్ సందర్భంగా టీడీపీ మహిళా కార్యకర్తలు లోకేశ్‌కు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు.



రూ.100 కోట్ల పెట్టుబడితో చేపడుతున్న రాడిసన్ 5 స్టార్ హోటల్ నిర్మాణం పూర్తయితే ఒంగోలు హాస్పిటాలిటీ రంగంలో సరికొత్త అధ్యాయం ప్రారంభమయ్యే అవకాశం ఉంది. అంతర్జాతీయ బ్రాండ్ హోటల్ రావడం వల్ల నగరానికి వచ్చే పర్యాటకులు, వ్యాపార ప్రతినిధుల సంఖ్య పెరగడంతో పాటు స్థానిక ఆర్థిక కార్యకలాపాలకు కూడా ఊతం లభించే అవకాశం ఉందని భావిస్తున్నారు.

# రేవంత్‌కు రాఖీ కట్టిన సురేఖ

## కొండా కీలక సురేఖ వ్యాఖ్యలు



## రేవంత్ రెడ్డికి రాఖీ కట్టిన మహిళా మంత్రులు

(మొదటి పేజీ తరువాయి)

రాఖీ పండుగ అంటే అన్నాచెల్లెళ్ల మధ్య ఉండే భరోసా, ఆత్మీయత, ప్రేమ, అనురాగం, గౌరవానికి ప్రతీక అని కొండా సురేఖ అన్నారు. మహిళ జీవితంలో తండ్రి, సోదరుడు, భర్త, కొడుకు వంటి పురుషుల భాగస్వామ్యం ఉంటుందని.. వారి నుంచి లభించే రక్షణ, భరోసా మహిళకు ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. అన్న, తమ్ముడిపై నమ్మకంతో రాఖీ కట్టి.. తనకు రక్షణగా ఉండాలని కోరుకోవడమే రక్షాబంధన్‌లోని ముఖ్య ఉద్దేశమని మంత్రి తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా రాఖీ పండుగ జరుపుకుంటున్న అక్కాచెల్లెళ్లు, అన్నదమ్ములకు ఆమె శుభాకాంక్షలు తెలిపారు. ఈ పండుగ ప్రతి ఒక్కరి జీవితాల్లో వెలుగులు నింపాలని, అందరూ ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలతో ఉండాలని ఆకాంక్షించారు.

రాఖీ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డికి రాఖీ కట్టానని కొండా సురేఖ తెలిపారు. తెలంగాణలో మహిళలందరి తరఫున ఆయనకు తమ ఆశీర్వాదం ఉంటుందని అన్నారు. రాష్ట్రానికి మంచి సుపరిపాలన అందించాలని కోరుకుంటున్నట్లు చెప్పారు. అంతేకాకుండా సీఎం రేవంత్ రెడ్డితో తన అనుబంధాన్ని ప్రస్తావిస్తూ "నన్ను సపరేట్ చేయకండి" అంటూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తాను తెలంగాణలోని ప్రతి ఆడపడుచుకు ప్రతినిధినని, గ్రామీణ ప్రాంతాల నుంచి అన్ని వర్గాల మహిళలకు సీఎం ఆశీర్వాదం ఉండాలని కోరుకుంటున్నట్లు తెలిపారు.

ఇటీవల కొండా సురేఖ చేసిన కొన్ని వ్యాఖ్యలు కాంగ్రెస్ పార్టీలో చర్చకు దారితీశాయి. ముఖ్యంగా పరకాల అసెంబ్లీ సీటు విషయంలో ఆమె చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో పార్టీలో అసమ్మతి స్వరాలు వినిపించాయి. కొందరు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, విప్‌లు కొండా సురేఖ కుటుంబంపై బహిరంగంగా విమర్శలు చేశారు. ఆమెను మంత్రి పదవి నుంచి తొలగించాలని కోరుతూ పార్టీ క్రమశిక్షణ కమిటీకి ఫిర్యాదు చేసినట్లు కూడా వార్తలు వచ్చాయి. ఈ పరిణామాల నేపథ్యంలోనే రాఖీ పౌర్ణమి సందర్భంగా కొండా సురేఖ సీఎం రేవంత్ రెడ్డి నివాసానికి వెళ్లి స్వయంగా రాఖీ కట్టడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది.

# అమెరికా నుంచి 'జావెలిన్'



**వాషింగ్టన్, ఆగస్ట్ 28, అనంత జనశక్తి న్యూస్**

యుద్ధంలో తన ప్రతిభను నిరూపించుకుని, ఒక్కరే మోసుకెళ్లగలిగే 'ఫైర్అండ్‌ఫర్గెట్' మీడియం రేంజ్ యాంటీ ట్యాంక్ విధ్వంసక ఆయుధ వ్యవస్థ జావెలిన్‌ను కొనుగోలుకు ప్రణాళికలు రచిస్తోందని అమెరికా రాయబారి సెర్గియో గోర్ తెలిపారు. న్యూఢిల్లీ, వాషింగ్టన్‌ల మధ్య రక్షణ సహకారాన్ని బలోపేతం చేసే చర్యలో భాగంగా, గత ఏడాది నవంబర్‌లో భారత్‌కు ఎఫ్‌జీఎం 148 జావెలిన్ ఆయుధ వ్యవస్థ విక్రయానికి అమెరికా విదేశాంగ శాఖ ఆమోదం తెలిపింది.

"బిగ్ న్యూస్.. క్షేత్రస్థాయి పోరాటాల్లో నిరూపితమైన జావెలిన్ యాంటీట్యాంక్ వ్యవస్థను కొనుగోలు చేయడానికి భారత్ ప్రణాళిక రచిస్తోంది. మే 2026 షాంగ్రీలా డైలాగ్‌లో అమెరికా రక్షణ కార్యదర్శి పీట్ హెగ్సేత్ నొక్కి చెప్పినట్లుగా.. ఇది అమెరికాభారత్ రక్షణ సంబంధాలలో ఒక గొప్ప ముందడుగు.. కోప్రొడక్షన్ అవకాశాలకు తలుపులు తెరుస్తుంది. మన రెండు దేశాల మధ్య సంబంధాలు రికార్డు స్థాయికి చేరుకున్నాయి" అని గోర్ ఎక్స్ (ట్విట్టర్)లో తెలిపారు.

ఈ క్షిపణి వ్యవస్థ ఇప్పటికే అమెరికా ఆర్మీ, మెరైన్ కార్ప్స్‌తో పాటు పలు అంతర్జాతీయ భాగస్వామ్య దేశాల వద్ద సేవలు అందిస్తోందని రాయబార కార్యాలయం జోడించింది. "ఈ ఒప్పందం రెండు దేశాల రక్షణ పరిశ్రమలు కలిసి పనిచేయడానికి కొత్త అవకాశాలను సృష్టిస్తుంది. ఇరు దేశాల రక్షణ పారిశ్రామిక స్థావరాలను బలోపేతం చేసే భవిష్యత్తు సహకారానికి గొప్ప సంభావ్యతను మేము చూస్తున్నాం" అని గోర్ తెలిపారు.

ఎన్ని జావెలిన్ యాంటీట్యాంక్ గైడెడ్ క్షిపణి వ్యవస్థలను కొనుగోలు చేస్తోంది లేదా ఈ కొనుగోలు మొత్తం వ్యయం ఎంత అనే వివరాలు మాత్రం తెలియరాలేదు. అలాగే ఈ ఒప్పందంపై న్యూఢిల్లీ నుంచి కూడా ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు.

**'జావెలిన్' ప్రత్యేకతలు**

జావెలిన్ అనేది శత్రువుల సాయుధ వాహనాలు, ట్యాంకులను ధ్వంసం చేయడానికి 'లాక్‌హీడ్ మార్టిన్', 'ఆర్టీఎక్స్' సంస్థలు సంయుక్తంగా అభివృద్ధి చేసిన పోర్టబుల్ యాంటీట్యాంక్ క్షిపణి వ్యవస్థ. దీనిని అమెరికా, దానికి మిత్రదేశాల దళాలు విస్తృతంగా ఉపయోగిస్తున్నాయి. భుజంపై పెట్టుకుని ప్రయోగించే ఈ వ్యవస్థలో ఆటోమేటిక్ గైడెన్స్ మెకానిజం ఉంటుంది. ఇది క్షిపణిని ప్రయోగించిన తర్వాత స్వయంచాలకంగా లక్ష్యాన్ని ఛేదిస్తుంది. దీనివల్ల ఆయుధాన్ని ప్రయోగించిన సైనికుడు వెంటనే సురక్షిత ప్రాంతంలో దాక్కునే వీలు కలుగుతుంది.

ట్యాంకులో సిబ్బంది ప్రవేశించే పైభాగం (కానోపీ) వద్ద రక్షణ కవచం (ఆర్మర్) చాలా తక్కువగా ఉంటుంది. ఈ జావెలిన్ క్షిపణి రివర్స్ 'U' ఆకారపు మార్గంలో ప్రయాణించి సరిగ్గా ట్యాంక్ పైభాగాన్నే ఖచ్చితత్వంతో తాకుతుంది. గన్నర్ కర్సర్ ఉపయోగించి లక్ష్యాన్ని ఎంచుకున్న తర్వాత, కమాండ్ లాంచ్ యూనిట్ క్షిపణికి 'లాక్ఆన్‌బిఫోర్‌లాంచ్' సంకేతాన్ని పంపుతుంది. తక్కువ బరువు ఉండటం వల్ల ప్రయోగించిన తర్వాత దళాలు సులభంగా వేరే ప్రదేశానికి మారడానికి లేదా మరొక లక్ష్యాన్ని ఛేదించడానికి వెంటనే రీలోడ్ చేసుకోవడానికి వీలవుతుంది. దీని 'సాఫ్ట్‌లాంచ్' డిజైన్ కారణంగా ఈ వ్యవస్థను భవనాలు, బంకర్లతో సహా మూసివున్న నిర్మాణాలు లేదా ఇరుకైన ప్రదేశాల నుంచి కూడా సురక్షితంగా ప్రయోగించవచ్చు. అమెరికా ఆర్మీ, మెరైన్ కార్ప్స్ కోసం ఫ్లోరిడాలోని ఓర్లాండోకు చెందిన లాక్‌హీడ్ మార్టిన్, అరిజోనాలోని టుక్సాన్‌కు చెందిన రేథియాన్ భాగస్వామ్యంతో కూడిన 'జావెలిన్ జాయింట్ వెంచర్' దీనిని అభివృద్ధి చేసి తయారు చేస్తోంది.

**భారత్- అమెరికా రక్షణ బంధం**

అమెరికా నుంచి భారత్ రక్షణ పరికరాల కొనుగోలును పెంచుతున్న తరుణంలో ఈ పరిణామం చోటుచేసుకుంది. నవంబరు 2025లో దాదాపు 100 జావెలిన్ వ్యవస్థలు, 216 ఎక్స్‌కాలిబర్ గైడెడ్ ఆర్టిలరీ ప్రొజెక్టైళ్లతో కూడిన 93 మిలియన్ డాలర్లు విలువైన విక్రయానికి యుఎస్ స్టేట్ డిపార్ట్‌మెంట్ ఆమోదం తెలిపింది. స్టాక్‌హోమ్ ఇంటర్నేషనల్ పీస్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ డేటా ప్రకారం.. సైనిక వ్యయంలో ప్రపంచంలోనే ఐదో అతిపెద్ద దేశంగా, ఉక్రెయిన్ తర్వాత రెండో అతిపెద్ద ఆయుధ దిగుమతిదారుగా ఉన్న భారత్.. ఇప్పటికే తన M777 హొవిట్జర్లతో ఎక్స్‌కాలిబర్ మందుగుండు సామగ్రిని ఉపయోగిస్తోంది. తేదాది అక్టోబరులో అమెరికా, భారత్ భూమి, సముద్రం, ఆకాశం, అంతరిక్షం, సైబర్ స్పేస్‌లలో పరస్పర రక్షణ సహకారాన్ని విస్తరించడానికి ప్రధాన రక్షణ భాగస్వామ్య ఒప్పందంపై సంతకం చేశాయి. భారత్ ఇప్పటికే అపాచీ, చినూక్ హెలికాప్టర్లు, సీ17, సీ130జే రవాణా విమానాలు, పీ8ఐ సముద్ర పర్యవేక్షణ విమానాలు, ఎం777 హొవిట్జర్లతో సహా పలు అమెరికా తయారీ రక్షణ పరికరాలను సమకూర్చుకుంది.

# యూరియా సరఫరాలో ఇబ్బందులు లేవు

**హైదరాబాద్, ఆగస్ట్ 28, అనంత జనశక్తి న్యూస్**

వ్యవసాయ యాంత్రీకరణ పథకంలో పనిముట్లు ఖరారు చేశామని తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వ్యాఖ్యానించారు. యాంత్రీకరణ సబ్సిడీ నిధులను నేరుగా రైతుల ఖాతాల్లోకి జమ చేస్తామని పేర్కొన్నారు. రాష్ట్ర సచివాలయంలో శుక్రవారం వ్యవసాయశాఖపై మంత్రి తుమ్మల సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు కీలక అంశాలపై మంత్రి దిశానిర్దేశం చేశారు. ఎంప్యానెల్ సంస్థల జాబితాను హాకా అధికారులు పరిశీలిస్తున్నారని తెలిపారు.

**ఆ యాప్‌పై రైతులకు విస్తృత అవగాహన కల్పించాలి..**

యూరియా సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు లేవని మంత్రి స్పష్టం చేశారు. ఫెర్టిలైజర్ యాప్ సమస్యలను.. అదే రోజే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కేంద్ర ఫెర్టిలైజర్ యాప్‌పై రైతులకు విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. కాంప్లెక్స్ ఎరువులకూ సబ్సిడీ ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. అన్నదాతలు యూరియాను అధికంగా వాడే పరిస్థితి మారాలని అన్నారు. ఆయిల్‌పామ్ సాగు విస్తరణలో వేగం పెంచాలని ఆదేశించారు. రైతులకు 2 నుంచి 3 రోజుల్లోనే ఆయిల్‌పామ్ మొక్కలు అందేలా చర్యలు తీసుకోవాలని నిర్దేశించారు.

**ఆయిల్‌పామ్ మొక్కలను నర్సరీల్లో సిద్ధం చేయాలి..**

డిమాండ్ ఎక్కువగా ఉన్న జిల్లాలకు మొక్కల సరఫరాలో ప్రాధాన్యం కల్పించాలని మంత్రి అన్నారు. లక్ష్యానికి రెండింతల ఆయిల్‌పామ్ మొక్కలను నర్సరీల్లో సిద్ధం చేయాలని సూచించారు. డ్రిప్ ఇరిగేషన్ ఏర్పాటును వేగవంతం చేయాలని ఆదేశించారు. 2600 రైతు వేదికలపై సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. 2 నుంచి 3 నెలల్లో రైతు వేదికలపై సోలార్ పనులు పూర్తి చేయాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దిశానిర్దేశం చేశారు.



# పెనం మీది నుంచి పొయ్యిలో పడ్డారు



**హైదరాబాద్, ఆగస్ట్ 28, అనంతజనశక్తి న్యూస్**

తెలంగాణలో కేసీఆర్ పాలనలాగానే.. రేవంత్ రెడ్డి పాలన కూడా ఉందని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ విమర్శించారు. రేవంత్ రెడ్డి పాలనతో పెనం మీద నుంచి పొయ్యిలో పడ్డామని రాష్ట్ర ప్రజలు భావిస్తున్నారని తెలిపారు. శుక్రవారం తెలంగాణ సెక్రటేరియట్‌లో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజుతో ఎంపీ ఈటల రాజేందర్ భేటీ అయ్యారు. అనంతరం సెక్రటేరియట్ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ.. కేంద్రం ఐదు కిలోల సన్న బియ్యం ప్రజలకు ఇస్తున్నా.. ప్రధాని మోదీ పోటో వేయడం లేదని మండిపడ్డారు. ఎవరి జాగీరని మీ ఫొటోలు వేసుకుంటున్నారంటూ కాంగ్రెస్ ప్రభుత్వంలోని నేతలపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ.. యూఎస్, యూరప్ వెళ్లి.. భారత్‌లో మత కల్లోలాలు జరుగుతున్నాయని అంటారని విమర్శించారు. లుంబిని పార్క్, గోకుల్ చాట్ వద్ద ఎవరి హయాంలో బాంబులు పేలాయని కాంగ్రెస్ పార్టీ నేతలను ఆయన సూటిగా ప్రశ్నించారు. సీఎం రేవంత్.. దేశ రాజధాని ఢిల్లీకి వచ్చి మీ ఆశీర్వాదంతోపాటు మీ మద్దతు కావాలంటారని వ్యంగ్యంగా అంటారని తెలిపారు. ఇక్కడికి వచ్చి అదే సీఎం రేవంత్.. ప్రధాని మోదీపై విమర్శలు గుప్పిస్తారని పేర్కొన్నారు. మోదీ దేశానికి ప్రధాని కాబట్టే రాష్ట్రానికి ఇన్ని రహదారులు, రైల్వే అభివృద్ధికి నిధులు వచ్చాయని ఎంపీ ఈటల వివరించారు. రాష్ట్రాల అభివృద్ధిలోనే దేశాల అభివృద్ధి ఉందని మోదీ అంటారని గుర్తు చేశారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను కేంద్ర ప్రభుత్వం మాకెంటి ఇచ్చేదని అన్నారన్నారు. అలాగే ప్రధాని మోదీ ఏ ముఖం పెట్టుకుని వస్తున్నారని కేసీఆర్ ప్రశ్నించిన విషయాన్ని గుర్తు చేశారు. అసలు దేశ ప్రధాని మోదీని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కేర్ చేయలేదన్నారు. అలా చేయడం రాష్ట్రాలకు మంచిది కాదని.. అరిష్టమని ఆయన తెలిపారు. తెలంగాణలో ఇందిరమ్మ కమిటీలు వేసి పార్టీ నాయకులకు కేటాయించుకుంటున్నారని మల్కాజ్‌గిరి ఎంపీ విమర్శించారు. మీ తాత జాగీరు కాదు అలా చేయడానికి అంటూ కాంగ్రెస్ నేతలపై నిప్పులు చెరిగారు. ఇందిరమ్మ ఇళ్లపై కేంద్రానికి ఎలాంటి వివక్షత లేదన్నారు. మూడు సంవత్సరాలలో రాష్ట్ర ప్రభుత్వం అడిగిన దాని కంటే రూ.100 కోట్లు అధికంగా కేంద్రం ఇచ్చిందన్నారు. మెట్రో ఫేజ్ -1, ఫేజ్ -2 కు కేంద్ర ప్రభుత్వం సహకారం అందిస్తుందని పేర్కొన్నారు. హైదరాబాద్ చుట్ట పక్కల గ్రామాలను కూడా కలిపారని చెప్పారు. కానీ వాటిని పట్టించుకోవట్లేదని విమర్శించారు. రైల్ ఓవర్ బ్రిడ్జ (ఆర్ఓబీ), రైలు అండర్ బ్రిడ్జ (ఆర్‌యూబీ) సదుపాయం లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వీటి నిర్మాణం చేయాలని కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విన్ వైష్ణవ్‌ను కలిసి విజ్ఞప్తి చేశామన్నారు. కేంద్రం సహకరిస్తుందని.. కానీ రూపాయి ఇవ్వకపోయినా రాష్ట్ర ప్రభుత్వం సహకారం కావాలని కేంద్ర మంత్రి వివరించారని ఎంపీ ఈటల ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ అంశంపై తెలంగాణ సీఎస్‌ను కలిసి మాట్లాడానని రేవంత్ తెలిపారు. హైదరాబాద్‌లో అర్బన్, రూరల్ హౌసింగ్ స్కీం పనులు వేగంగా చేయాలని సీఎస్‌ను కోరినట్లు ఎంపీ ఈటల వివరించారు. రైల్వే పెద్ద టెండర్లలో పాల్గొని నగదు తీసుకుంటున్నారని.. కానీ చిన్న చిన్న టెండరల్లో పాల్గొనట్లేదంటూ ఆయన అసహనం వ్యక్తం చేశారు. దీని వల్ల అభివృద్ధి కావడం లేదన్నారు. మేడ్చల్, మల్కాజ్‌గిరి రైల్వే స్టేషన్లకు అమృత్ పథకంలో భాగంగా రూ.22 కోట్లు కేంద్రం ఇస్తుందని అన్నారు. అన్ని రైల్వేస్టేషన్లు ఫేస్ లిఫ్టింగ్ చేయడానికి కేంద్ర మంత్రి హామీ ఇచ్చారని చెప్పారు. మేడ్చల్, సికింద్రాబాద్ పరిధిలో గేట్ల వద్ద ఆర్వోబీ, ఆర్‌యూబీ నిర్మాణం జరుగుతోందని అన్నారు.

## భారత్‌కు రానున్న 'జావెలిన్'..

# భుజంపై నుంచే శత్రువుకు గురి..!



భారత అమ్ముల పొదిలో మరో అస్త్రం చేరనుంది. అధునాతన జావెలిన్ క్షిపణులను కొనుగోలు చేసేందుకు అమెరికాతో భారత్‌కు ఒప్పందం కుదిరింది. ఈ విషయాన్ని మన దేశంలోని అమెరికా రాయబారి సెర్గియో గోర్ శుక్రవారం వెల్లడించారు. ఇరు దేశాల మధ్య సమర్థవంతమైన ద్వైపాక్షిక రక్షణ భాగస్వామ్యాన్ని ఈ ఒప్పందం ప్రతిబింబిస్తుందని పేర్కొన్నారు. యూఎస్ ఫారిన్ మిలిటరీ సేల్స్ ప్రక్రియలో భాగంగా ఈ క్షిపణుల కొనుగోలుకు సంబంధించిన లెటర్ ఆఫ్ ఆఫర్ అండ్ యాక్సెప్టెన్స్‌పై భారత సైన్యం తాజాగా సంతకం చేసింది. అయితే, ఒప్పందంలో భాగంగా ఎన్ని క్షిపణలను మన దేశం కొనుగోలు చేస్తోంది..? మొత్తం ఖర్చెంత..? అన్న వివరాలు ఇంకా తెలియరాలేదు.

**3ఏంటీ 'జావెలిన్' ప్రత్యేకత..?**

జావెలిన్.. ట్యాంక్ విధ్వంసకర క్షిపణి (ఏటీజీఎంయాంటీ ట్యాంక్ గైడెడ్ మిసైల్). దీనిని భుజంపై నుంచి శత్రు ట్యాంకుల పైకి గురిపెట్టి ప్రయోగించవచ్చు. దీనిలో 3.7 అడుగుల క్షిపణి, డిస్పోజబుల్ లాంచ్ ట్యూబ్, కమాండ్ కంట్రోల్ యూనిట్ ఉంటాయి. వాస్తవానికి ట్యాంక్‌పైకి విధ్వంసకర ఆయుధాలను ప్రయోగించినప్పుడు.. ఆ ప్రదేశం నుంచి పొగ, వేడి వెలువడతాయి. ప్రత్యర్థులు హీట్ సెన్సర్లతో వాటిని గుర్తిస్తారు. కానీ, జావెలిన్‌లో తొలుత ట్యూబ్ నుంచి ఓ మోటర్ క్షిపణిని బయటకు కొంతదూరం విసురుతుంది. ఆ తర్వాత క్షిపణి మోటార్ పనిచేయడం మొదలుపెట్టి లక్ష్యం వైపు దూసుకెళుతుంది. దీనిని కంప్యూటర్‌తో నియంత్రిస్తారు. దీంతో కచ్చితంగా జావెలిన్‌ను ఎక్కడినుంచి ప్రయోగించారో శత్రువుకు అర్థం కాదు. ఈ లోపు ప్రయోగించిన వారు సురక్షిత ప్రదేశంలో దాక్కోవచ్చు.

రీయాక్టివ్ ఆర్మర్ రక్షణ కవచాలను ఛేదించి.. ట్యాంకును ధ్వంసం చేసేలా దీనిలో రెండు దశల్లో పేలుడు పదార్థాలను అమర్చారు. తొలిదశలో కవచాన్ని ఛేదించి.. ఆ తర్వాత దశలో వార్‌హెడ్ ట్యాంక్‌ను ధ్వంసం చేస్తుంది. వీటిని అమెరికాకు చెందిన రక్షణరంగ దిగ్గజాలు రేథియాన్, లాక్‌హీడ్ మార్టిన్ సంస్థలు అభివృద్ధి చేశాయి. వీటి ఉత్పత్తి చాలా క్లిష్టమైన, ఖరీదైన వ్యవహారం. వీటి ధర దాదాపు 2 లక్షల డాలర్ల వరకూ ఉంటుందని అంచనా.

**ఉక్రెయిన్‌కు దేవదూత..**

రష్యాతో పోరులో ఉక్రెయిన్ ఈ క్షిపణులను విపరీతంగా వినియోగించింది. మాస్కోకు చెందిన పలు యుద్ధ ట్యాంకులను పేల్చేసింది. వీటి నుంచి తప్పించుకోవడం కోసం రష్యా తమ ట్యాంకులపై లోహపు బోన్లను అమర్చిందంటే.. వీటి సామర్థ్యాన్ని అర్థం చేసుకోవచ్చు. అప్పట్లో ఈ క్షిపణులను ఉక్రెయిన్ వాసులు 'దేవదూత'తో పోల్చారు.

# అప్రమత్తంగా ఉండండి.. ఘర్షణలకు దిగకండి: హెచ్ఏఎఫ్

**వీసా రద్దుకు యూఎస్‌సీఐఆర్ఎఫ్ డిమాండ్**

రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆరెస్సెస్) అధినేత మోహన్ భాగవత్ శనివారం న్యూయార్క్‌లో పాల్గొనబోయే సమావేశంపై రాద్ధాంతం మొదలైంది. మూడు దేశాల పర్యటనలో భాగంగా ఆయన న్యూయార్క్ చేరుకున్నారు. నిరసనలకు బహిరంగంగానే పిలుపునివ్వడంతో ఘర్షణ వాతావరణం నెలకొంది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, కార్యకర్తలతో ఎలాంటి ఘర్షణలకు దిగవద్దని 'హిందూ అమెరికన్ ఫౌండేషన్' (హెచ్ఏఎఫ్) విజ్ఞప్తి చేసింది. కార్యక్రమ రద్దుకు, అవాంతరాలకు ప్రయత్నాలు జరిగే అవకాశం ఉందని హెచ్చరించింది. హాజరయ్యేవారికి, పౌరహక్కులకు రక్షణ కల్పించాలని న్యూయార్క్ మేయర్ మమ్దానీని కోరింది. సభావేదిక వద్ద నిరసన ప్రదర్శనలు నిర్వహించాలని 'హిందూస్ ఫర్ హ్యూమన్ రైట్స్', 'సేవ్ అమెరికా ఫ్రం హిందుత్వ', 'ఇండియన్ అమెరికన్ ముస్లిం కౌన్సిల్', 'దళిత్ సాలిడారిటీ ఫోరం' వంటి సంస్థలు సిద్ధమవుతున్నాయి. ''భాగవత్ హిందువుల ప్రతినిధి కాదు. హింసకు ఆజ్యం పోయడం, బహిష్కారం, మైనారిటీ వర్గాల్లో భయం రేకెత్తించడం వంటివాటితో కూడిన అతివాద హిందూ జాతీయ ఉద్యమానికి ఆయన నేతృత్వం వహిస్తున్నారు'' అని 'హిందూస్ ఫర్ హ్యూమన్ రైట్స్' డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శ్రావ్య తాడేపల్లి ఆరోపించారు.

**ఆంక్షలు విధించాలి**

భాగవత్ వీసాను రద్దు చేయాలని ట్రంప్ సర్కారును 'అంతర్జాతీయ మత స్వేచ్ఛపై అమెరికా కమిషన్' (యూఎస్‌సీఐఆర్ఎఫ్) గట్టిగా కోరింది. మత స్వేచ్ఛ ఉల్లంఘనలకు పాల్పడినవారిపై ఆంక్షలు విధించే విషయం పరిశీలించాలని కోరామని సంస్థ అధ్యక్షుడు ఆసిఫ్ మహమూద్ తెలిపారు. ఆరెస్సెస్ సభ్యులు మతపరమైన మైనారిటీలపై హింసాత్మక దాడులకు పాల్పడ్డారని సంస్థ ఆరోపించింది. ఇది విశ్వసనీయత లేని పక్షపాతపూరిత సంస్థ అని భారత విదేశీ వ్యవహారాల శాఖ విమర్శించింది. భాగవత్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న సంస్థ ఎక్స్ హ్యాండిల్ కొన్ని గంటలసేపు స్తంభించిపోయింది. విషయాన్ని ఎక్స్ దృష్టికి తీసుకువెళ్లాక దానిని పునరుద్ధరించారు. పర్యటన యథావిధిగా కొనసాగుతుందని 'అమెరికన్ హిందూస్ ఫర్ ఎంగేజ్‌మెంట్ అండ్ డైలాగ్' (ఎహెడ్) సంస్థ తెలిపింది. కార్యక్రమానికి దాదాపు 200 సంస్థలు మద్దతు ఇస్తున్నాయి.



## లక్ష చెట్లకు రాఖీలు.. 700 గ్రామాల సంకల్పం

ప్రజలకు, ప్రకృతికి మధ్య భావోద్వేగ అనుబంధాన్ని పెంపొందించడంలో భాగంగా శుక్రవారం 'రక్షాబంధన్' సందర్భంగా ఝార్ఖండ్‌లోని దాదాపు 700 గ్రామాల ప్రజలు లక్ష చెట్లకు రాఖీలు కట్టనున్నారు. 'సేవ్ ట్రీ' పేరుతో నెల రోజులపాటు ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తారు. ముప్పై రోజుల్లో రాష్ట్రంలోని 24 జిల్లాల్లో మొత్తం మూడు లక్షల చెట్లకు రాఖీలు కట్టాలన్నది తమ లక్ష్యంగా ప్రధాన అటవీ సంరక్షణాధికారి సంజీవ్‌కుమార్ తెలిపారు. ఈ పండుగ రోజున తోబుట్టువులను కాపాడుతామని సోదరులు ప్రతిజ్ఞ చేసినట్టే, మానవ జీవితాలకు ఆధారమైన పర్యావరణ పరిరక్షణకు పాటుపడతామని బాస చేయడం మన కర్తవ్యమన్నారు. ఒకప్పుడు మావోయిస్టులతో ఎక్కువగా ప్రభావితమైన ధన్‌బాద్ జిల్లాలోని లుకైయా గ్రామం నుంచి 2004లో సంజీవ్‌కుమార్ ఈ మహత్తర 'రాఖీ' కార్యక్రమాన్ని ప్రారంభించారు. అప్పట్నుంచీ రాష్ట్రంలోని 12,000కు పైగా గ్రామాలను ఈ లక్ష్యానికి ఆయన అనుసంధానం చేశారు. అప్పట్లో లుకైయా గ్రామంలో పరిరక్షించిన 20,000 ఇప్ప చెట్లు నేడు ఆ గ్రామస్థులకు జీవనోపాధిని అందిస్తున్నాయి. రాష్ట్రంలో అడవుల విస్తీర్ణం గత రెండు దశాబ్దాల్లో 1,128 చదరపు కి.మీ.ల మేర పెరిగింది.



## తుపాకులు పట్టిన చేతులు రాఖీలు తయారు చేశాయి

ఛత్తీస్‌గఢ్‌లోని కాంకేర్ జిల్లాలో గల చౌగేల్ గ్రామంలో ప్రభుత్వం ఏర్పాటుచేసిన పునరావాస కేంద్రం కొందరి జీవితాల్లో శాంతి, గౌరవం, స్వయంసమృద్ధితో కూడిన కొత్త అధ్యాయాన్ని లిఖిస్తోంది. ఏళ్లతరబడి దట్టమైన అడవుల్లో తిరుగాడుతూ తుపాకులు పట్టిన ఆ చేతులు నేడు రంగురంగుల దారాలు, మెరిసేటి పూసలతో అందమైన రాఖీలు తయారు చేశాయి. లొంగిపోయిన మావోయిస్టులకు నైపుణ్య శిక్షణ ఇస్తున్న ఈ కేంద్రంలో 'రక్షాబంధన్' పండుగ కోసం వెయ్యికి పైగా రాఖీలను సిద్ధం చేశారు. మార్కెటులో ఇవి అప్పుడే అమ్ముడుపోవడంతో శిక్షణ పొందుతున్నవారు తమ శ్రమకు తగిన ఆదాయాన్ని కూడా కళ్ల జూశారు. ''పలు వృత్తుల్లో వీరికి శిక్షణ ఇస్తున్నాం. ఇప్పుడు రాఖీలు చేసినట్టే ఈ ఏడాది హోలీకి గులాల్ తయారుచేశారు'' అని కాంకేర్ ఏఎస్పీ ఆకాశ్ శ్రీశ్రీమాల్ చెప్పారు. ''అడవుల్లో బతికేటప్పుడు రక్షాబంధన్ గురించి వినడమే కానీ, ఎప్పుడూ చేసుకున్నది లేదు. ఈ ఏడాది ఇక్కడున్న భద్రతా సిబ్బందికి, మాతోటి శిక్షణార్థులకు రాఖీలు కట్టి పండుగ జరుపుకొంటాం'' అని సునీతా అనే యువతి తెలిపారు.



# నిత్యం రద్దీయే!

నేపాల్, టిబెట్ సరిహద్దుల్లోని 1,400 కిలోమీటర్ల పర్వతాల పరిధిలోని 100 కిలోమీటర్ల ప్రాంతం నిత్యం రద్దీగా ఉంటుంది. ఈ ప్రాంతాన్ని పర్వతారోహకులు, వ్యాపారులు, హిందూ భక్తులు తరచూ సందర్శిస్తుంటారు. ఈ సీజన్లో మరింత రద్దీగా ఉంటుంది. బుధవారం సంభవించిన వరద విపత్తులో ఈ ప్రాంతమే భారీగా దెబ్బతింది. అందుకే ప్రాణ నష్టం అధికంగా ఉంది. నీ 40 కిలోమీటర్ల సరిహద్దు రోడ్డు వరదతో ధ్వంసమైంది.

అధికారుల కథనం ప్రకారం.. స్థానికులను ఉపాధి కల్పించే ప్రాంతంలో భారీగా విధ్వంసం చోటుచేసుకుంది. దీంతో వారి ఉపాధి తీవ్రంగా దెబ్బతింది.

కైలాశ్ మానసరోవర్ యాత్రతోపాటు రక్షా బంధన్, శ్రావణ పౌర్ణమి సందర్భంగా ఇక్కడి గోసాయిన్‌కుండ్, దామోదర్‌కుండ్‌లలో పవిత్ర స్నానాల కోసం ఈ సమయంలోనే భారీగా భక్తులు వస్తుంటారు.

మార్చి నుంచి మే, సెప్టెంబరు నుంచి నవంబరు పర్వతారోహణకు సరైన సమయంగా భావిస్తుంటారు. ఈ కారణంగా రద్దీ ఉంటుందని భావించేవారు ఈ నెలలోనే వచ్చి పర్వతారోహణ చేస్తూ ఉంటారు. దీంతోపాటు ఆధ్యాత్మిక పర్యాటకాన్ని పూర్తి చేసుకుంటారు.

ఈ ప్రాంతంలోని లాంగ్‌టాంగ్ వ్యాలీ నుంచి అప్పర్ ముస్తాంగ్ వరకూ, సయాబ్రుబెసి నుంచి తైమూర్ వరకు, ఫికురి నుంచి నువాకోట్ వరకు పలు ట్రెక్కింగ్ సైట్లు ఉంటాయి. కైలాసగిరితోపాటు మానసరోవర్ సరస్సు, గోసాయిన్‌కుండ్, దామోదర్‌కుండ్, ముక్తినాథ్ ఆలయం, షెయ్ గోంపా క్షేత్రాలకు అధికంగా యాత్రికులు వస్తుంటారు.



**సరైన లెక్కలుండవ్**

ఇంత భారీగా పర్యాటకులను ఈ ప్రాంతం ఆకర్షిస్తున్నా.. ఇక్కడికి వచ్చే వారి లెక్కలు సరిగా ఉండవు. ఎంత మంది వచ్చారనేది లెక్కించడం కష్టం. అందువల్లే జరిగిన నష్టం ఎంతనేది కచ్చితంగా అంచనా వేయడమూ కష్టమే. రసువా జిల్లా మధ్య నేపాల్‌లోని భాగమతి ప్రావిన్సులో ఉంది. ఇక్కడ అద్భుతమైన హిమాలయన్ పచ్చిక బయళ్లు, పర్వతారోహక మార్గాలు, పవిత్ర క్షేత్రాలు.. పర్యాటకులను భారీగా ఆకర్షిస్తాయి. విదేశీ, దేశీయ పర్యాటకులు అధికంగా వస్తుంటారు. ఇక్కడి లాంగ్‌టాంగ్ పార్కులో ఔత్సాహిక పర్వతారోహకులకు శిక్షణ ఇస్తుంటారు. ఇక అప్పర్ ముస్తాంగ్ దగ్గర పర్వతారోహణ అనేది జీవితకాల అవకాశమని చాలా మంది భావిస్తుంటారు.

## తమ్ముడికి కొత్త జీవితం కానుకగా ఇచ్చిన సోదరి

రక్షాబంధన్ రోజున అక్కాచెల్లెళ్లు తమ సోదరులకు రాఖీ కట్టి రక్షణ కోరుకుంటారు. ఉత్తర్‌ప్రదేశ్‌లోని నొయిడాకు చెందిన బీనాకుమారి (45) మాత్రం తమ్ముడు జితేంద్ర సింగ్ (40)కు ఊహించని బహుమతి ఇచ్చి తానే రక్షగా నిలిచారు. జితేంద్ర గత రెండేళ్లుగా మూత్రపిండాల వ్యాధితో బాధపడుతున్నారు. వారానికి మూడుసార్లు డయాలసిస్‌కు వెళుతున్న తమ్ముడి ఆరోగ్యం క్రమంగా క్షీణిస్తుండటం గమనించిన బీనాకుమారి అతడు మళ్లీ సాధారణ జీవితం గడపాలని తన కిడ్నీ ఇవ్వడానికి ముందుకొచ్చారు. తగిన పరీక్షల అనంతరం నొయిడాలోని శారదా కేర్ హెల్త్‌సిటీ యూరాలజీ విభాగం డైరెక్టర్ డాక్టర్ అనిల్‌శర్మ ఆధ్వర్యంలో విజయవంతంగా శస్త్రచికిత్స పూర్తయింది. బీనాకుమారి కుడి కిడ్నీని తమ్ముడికి అమర్చారు. ఇద్దరూ కోలుకొంటున్నారు. చిన్నప్పటి నుంచీ తన జీవితానికి బలమైన అండగా నిలిచిన అక్క బీనాకుమారి.. రక్షాబంధన్ వేళ కిడ్నీ దానంతో కొత్త జీవితాన్ని ప్రసాదించిందని జితేంద్ర భావోద్వేగానికి గురయ్యారు.



## పోక్సో నేరగాడని తెలిసీ.. బాలికల పాఠశాలలో పోస్టింగా..?



మహారాష్ట్రలోని ఠాణె జిల్లాలో గల ఓ ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలలో 22 మంది బాలికలపై లైంగిక వేధింపుల ఘటన తీవ్ర దుమారం రేపింది. ఈ కేసులో పాఠశాలలో వంటవాడిగా పనిచేస్తోన్న గణపత్ గవిల్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. కాగా.. దర్యాప్తులో విస్తుపోయే విషయాలు వెలుగులోకి వచ్చాయి. నిందితుడు తరచూ ఇలాంటి నేరాలకు పాల్పడటమే గాక.. గతంలో ఓసారి పోక్సో చట్టం కింద జైలుకు కూడా వెళ్లినట్లు తెలిసింది. అలాంటి నేరచరిత్ర ఉన్న వ్యక్తిని స్కూల్లో నియమించుకోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ''గణపత్ గవిల్ గతంలో మరో ఆశ్రమ పాఠశాలలో పని చేశాడు. ఆ సమయంలో అతడు పలువురు బాలికలను వేధించినట్లు ఆరోపణలు రావడంతో పోక్సో చట్టం కింద కేసు నమోదైంది. నాడు అతడిని విధుల నుంచి సస్పెండ్ చేశారు. కొన్నాళ్ల పాటు జైల్లో ఉండి వచ్చాడు. ఇప్పుడు అతడిని మళ్లీ ఎలా విధుల్లోకి తీసుకున్నారు? ఎవరు నియమించారన్నది ఇంకా తెలియరాలేదు'' అని సంబంధిత అధికారులు వెల్లడించారు.

ఠాణె జిల్లాలోని తెంబాలో గల ఆదివాసి ఆశ్రమ పాఠశాలలో తాజా ఘటన చోటుచేసుకుంది. తొలుత బాధిత విద్యార్థులు ఆగస్టు 24న దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. భోజనం కోసం వచ్చిన తమను గణపత్ అసభ్యంగా తాకుతూ కొంతకాలంగా వేధిస్తున్నాడని పేర్కొన్నారు. దీంతో స్కూల్ యాజమాన్యాన్ని సంప్రదించిన పోలీసులు.. కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్ట్ చేశారు. ప్రస్తుతం దీనిపై దర్యాప్తు కొనసాగుతోంది. గణపత్ నియామకంపై పోలీసులు ఆరా తీస్తున్నారు.

## ఉజ్బెకిస్థాన్, కిర్గిస్థాన్‌లకు మోదీ

**- రేపట్నుంచీ నాలుగు రోజుల విదేశీ పర్యటన**

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కీలక ద్వైపాక్షిక, బహుపాక్షిక సమావేశాలకు సిద్ధమవుతున్నారు. ఈ నెల 29 నుంచి సెప్టెంబరు 1 వరకు ఉజ్బెకిస్థాన్, కిర్గిస్థాన్‌లలో మోదీ పర్యటించనున్నారు. పర్యటనలో భాగంగా కిర్గిస్థాన్ రాజధాని బిష్కెక్‌లో జరిగే షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీవో) సదస్సులో పాల్గొని, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో మోదీ ప్రత్యేకంగా సమావేశం కానున్నారు. ఈ భేటీలో ఇరు దేశాల మధ్య ఉన్న ద్వైపాక్షిక సంబంధాలను నేతలిద్దరూ సమగ్రంగా సమీక్షించనున్నారని విదేశీ వ్యవహారాల శాఖ కార్యదర్శి సిబీ జార్జ్ తెలిపారు. కిర్గిస్థాన్ అధ్యక్షుడు సాదిర్ జాపరోవ్ ఆహ్వానం మేరకు ఎస్‌సీవో సదస్సుకు హాజరవుతున్న మోదీ చివరిరోజు ప్లీనరీలో ప్రసంగిస్తారు. ఎస్‌సీవో దేశాల ఇతర నేతలతో కలిసి ఆరో వరల్డ్ నోమాడ్ గేమ్స్ ప్రారంభ వేడుకలకు మోదీ హాజరవుతారు. ఎస్‌సీవో సదస్సుకు పుతిన్‌తోపాటు చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్, పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ తదితరులు హాజరయ్యే అవకాశముంది. 2017 నుంచి భారత్ పూర్తిస్థాయి సభ్య దేశంగా ఉన్న ఈ శిఖరాగ్ర సదస్సు 25వ వార్షికోత్సవాన్ని జరుపుకోనుంది.

కిర్గిస్థాన్ కంటే ముందు 29, 30 తేదీల్లో ఉజ్బెకిస్థాన్‌లో ప్రధాని పర్యటిస్తారు. ఆ దేశ అధ్యక్షుడు షౌకత్ మిర్జియోయెవ్ ఆహ్వానం మేరకు తాష్కెంట్‌కు వెళతారు. ఇది ఉజ్బెకిస్థాన్‌లో మోదీకి నాలుగో పర్యటన. తాష్కెంట్‌లో మిర్జియోయెవ్‌తో మోదీ ప్రతినిధి స్థాయి చర్చలు జరపనున్నారు. భారత్ ఉజ్బెకిస్థాన్ వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడమే ఈ చర్చల ప్రధాన ఉద్దేశం. వాణిజ్యం, పెట్టుబడులు, రక్షణ, డిజిటల్ కనెక్టివిటీ, ఇంధనం, విద్య, ప్రజల మధ్య సంబంధాలు వంటి అంశాలపై ఇరు దేశాల నేతలు చర్చించనున్నారు. తాష్కెంట్‌లో శాస్త్రి మెమోరియల్, తాష్కెంట్ స్టేట్ యూనివర్సిటీ ఆఫ్ ఓరియంటల్ స్టడీస్‌లోని మహాత్మాగాంధీ కేంద్రాన్ని మోదీ సందర్శించనున్నారు.

## భూతల యుద్ధాల్లో ట్యాంకులే కీలకం: రాజ్‌నాథ్



ఆధునిక యుద్ధాలలో డ్రోన్లు, క్షిపణుల పాత్ర పెరుగుతున్నప్పటికీ భూతల యుద్ధాల్లో ఇప్పటికీ ట్యాంకులు అత్యంత కీలక పాత్ర పోషిస్తున్నాయని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఉద్ఘాటించారు. ట్యాంకులు దేశ సరిహద్దుల్లో ఇనుప గోడలా నిలుస్తూ మన సైనికుల మనోస్థైర్యం పెంచుతాయని వివరించారు. 57 ఏళ్ల చరిత్ర కలిగిన జబల్‌పుర్ వెహికల్ ఫ్యాక్టరీ ఆర్డినెన్స్ యూనిట్‌లో రూ.472 కోట్ల వ్యయంతో టీసిరీస్ యుద్ధ ట్యాంకుల మరమ్మతులు/పునరుద్ధరణ కేంద్ర నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. మన సైన్యం ప్రపంచంలో అత్యంత శక్తివంతమైన బలగాలలో ఒకటని చెప్పారు. జబల్‌పుర్ కేంద్రం ద్వారా ఏటా 80 టి72, టి90 ట్యాంకులను ఓవర్‌హాల్ చేస్తారని సింగ్ తెలిపారు. సైన్యానికి ఏటా దాదాపు 230 ట్యాంకుల ఓవర్‌హాల్ అవసరం ఉందని ఆయన వివరించారు. తమిళనాడు, అవడిలోని హెవీ వెహికల్స్ ఫ్యాక్టరీ ప్రస్తుతం ఏటా దాదాపు 150 ట్యాంకులను ఓవర్‌హాల్ చేస్తోందని, మిగిలినవాటిని జబల్‌పుర్‌లో ఏర్పాటు చేస్తున్న కొత్త కేంద్రం చేస్తుందని రక్షణ మంత్రి చెప్పారు.

## నియోజకవర్గాల పునర్విభజనపై మీ ప్రణాళిక బహిర్గతం చేయండి



లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజనపై అఖిలపక్ష సమావేశం ఏర్పాటుచేసి ప్రభుత్వ ప్రణాళిక ఏమిటనేది పంచుకోవాలని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే గురువారం ప్రధాని నరేంద్రమోదీని కోరారు. లోక్‌సభ స్థానాల సంఖ్యను ఇప్పుడున్న 543కే మరో పాతికేళ్లపాటు పరిమితం చేయాలన్నారు. రాష్ట్రాలవారీగా స్థానాల సంఖ్యను అప్పటివరకు ఇలాగే ఉంచాలని, 2029 సార్వత్రిక ఎన్నికల నుంచి 33% మహిళా రిజర్వేషన్లను అమలు చేసే బిల్లును ప్రవేశపెట్టాలని ప్రధానికి లేఖ రాశారు. ''డీలిమిటేషన్ బిల్లుకోసం ప్రత్యేకంగా పార్లమెంటు సమావేశాలు ఏర్పాటుచేసే అవకాశం ఉందని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్‌రిజిజు బుధవారం రాత్రి ఓ ఇంటర్వ్యూలో ప్రకటించారు. వర్షాకాల సమావేశాలు ప్రొరోగ్ చేయకుండా సుదీర్ఘంగా జాప్యం చేయడానికి బహుశా ఇదే కారణమేమోనని అనిపిస్తోంది. మీరు ఒకవేళ బిల్లు తేవాలనుకుంటే అందరిముందు ప్రతిపాదనలను ఉంచండి. వాటిపై అధ్యయనం చేసి స్పందించడానికి పార్టీలకు, రాష్ట్రాలకు తగిన సమయం ఇవ్వండి'' అని దీనిలో కోరారు. నియోజకవర్గాల పెంపు అంశం దేశానికి చాలా ముఖ్యమైంది కాబట్టి ఏప్రిల్ తరహాలో మాత్రం బలవంతంగా మరో ప్రయత్నం చేయొద్దని కోరారు.




# డిజిటల్ చెల్లింపుల్లో కుదుపు

మన దేశంలో ఆర్థిక లావాదేవీలను డిజిటల్ రూపంలోకి మార్చిన చెల్లింపుల వ్యవస్థ 'యూపీఐ'... ఆర్థిక విప్లవాన్నే సృష్టించింది. అప్పటికప్పుడే జరిగే రియల్ టైమ్ చెల్లింపుల నెట్‌వర్క్‌లలో యూపీఐని సంఖ్యాపరంగా అతిపెద్ద వ్యవస్థగా ఇటీవలే అంతర్జాతీయ ద్రవ్యనిధి (ఐఎంఎఫ్) సైతం గుర్తించింది. ప్రజా డిజిటల్ మౌలిక సదుపాయాల్లో భారత్‌ను అగ్రగామిగా పేర్కొంది. ఇలాంటి పరిస్థితుల్లో యూపీఐ లావాదేవీలపై రుసుముల ప్రతిపాదనలు బాగా చర్చనీయాంశమయ్యాయి. నిజంగానే ఆ రుసుములు అమల్లోకి వస్తే ఫలితాలు ఎలా ఉంటాయి?

కేంద్ర ప్రభుత్వం 2016లో ప్రవేశపెట్టిన యూపీఐ (యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్) పద్ధతి అసాధారణ రీతిలో దేశంలోని అన్ని ప్రాంతాల వ్యాపారులు, వినియోగదారుల ఆదరణను చూరగొంది. ఫోన్ నంబర్లు, క్యూఆర్ కోడ్, మొబైల్ యాప్‌ల ద్వారా 'వ్యక్తి నుంచి వ్యక్తికి', 'వ్యక్తి నుంచి వ్యాపారి'కి వెనువెంటనే జరిగే చెల్లింపులు అద్భుతాన్నే సృష్టించాయి. కార్డు ద్వారా చెల్లింపులను సైతం అధిగమించి, అతివేగంగా ప్రాచుర్యం పొందాయి. 2016-17లో రెండు కోట్లతో మొదలైన యూపీఐ లావాదేవీల సంఖ్య 2025-26 నాటికి 24,162 కోట్లకు పెరిగాయి. వాటి విలువ రూ.314 లక్షల కోట్లకు చేరుకుంది. యూపీఐలో మొదట్లో 44బ్యాంకులు పాల్గొనగా, ఇప్పుడు వాటి సంఖ్య 700 దాటింది. సాధారణంగా అంతర్జాతీయ కార్డ్ నెట్‌వర్క్స్ ఛార్జ్ చేసే కమీషన్‌ను వ్యాపారుల అమ్మకాల్లో వాటా (మర్చెంట్ డిస్కౌంట్ రేట్-ఎండీఆర్)గా వ్యవహరిస్తారు. ప్రస్తుతం 'వ్యక్తుల నుంచి వ్యాపారుల' మధ్య రెండువేల రూపాయలకు మించి జరిగే చెల్లింపులపై ఎండీఆర్ విధించేందుకు రంగం సిద్ధం కావడం చర్చకు దారితీసింది.

**రుసుములతో వచ్చే రాబడి తక్కువే...**

స్థూల ఆర్థిక వ్యవస్థ ప్రయోజనాల దృష్ట్యా డిజిటల్ చెల్లింపుల వ్యవస్థ, యూపీఐ నిర్దిష్ట లావాదేవీలపై ఎండీఆర్ విధించకపోవడమే మేలు. ఎందుకంటే- నగదు, చెక్‌ల నుంచి మిత నగదు వ్యవస్థ వైపు మారడం వల్ల సాంప్రదాయిక బ్యాంకింగ్ క్లియరింగ్ సదుపాయాలకయ్యే ఖర్చులు తగ్గుతాయి. అంతే కాకుండా, కరెన్సీకయ్యే వ్యయం, ముఖ్యంగా తక్కువ విలువగల నోట్ల ముద్రణ, నిల్వ, భద్రత, రవాణా, బీమా, వితరణ ఖర్చులను కూడా తగ్గించవచ్చు. రిజర్వ్ బ్యాంక్ నిరుటి వార్షిక నివేదికను బట్టి గత అయిదేళ్లలో నోట్ల ముద్రణా ఖర్చులే 59శాతం పెరిగినట్లు తెలుస్తోంది. ఆ ఖర్చులతో పోలిస్తే డిజిటల్ చెల్లింపుల వ్యయం ఓ చిన్న భాగం మాత్రమే. దీర్ఘకాల పరిశీలనల ప్రకారం నగదు ఆర్థిక వ్యవస్థ నుంచి డిజిటల్ వ్యవస్థ వైపు మరలే ధోరణి దినదిన ప్రవర్ధమానమవుతోంది. ప్రజల ద్రవ్య నిల్వలు బ్యాంక్ ఖాతాల్లో నిల్వలుగా పరివర్తన చెందడం దేశ రుణ వనరులు పెరగడానికి, ఆర్థిక స్థిరత్వాన్ని మరింతగా బలపర్చడానికి దోహదం చేస్తుంది. నగదు భౌతిక నిర్వహణ తగ్గడం వల్ల పొదుపయ్యే వేల కోట్ల రూపాయలతో పోలిస్తే, యూపీఐలో జరిగే రెండు వేల రూపాయలకు మించిన వ్యాపారుల లావాదేవీలపై విధించే ఎండీఆర్‌తో వచ్చే రాబడి చాలా తక్కువే. యూపీఐ వ్యవస్థ నిర్వహణకు అయ్యే ఖర్చు, కేంద్ర ప్రభుత్వానికి రిజర్వ్ బ్యాంక్ చెల్లించే వార్షిక మిగులు డివిడెండ్ బదిలీలో సుమారు 3-8.5 శాతానికి సమానం. ఆ డివిడెండ్ మొత్తం 2026 నాటికి సుమారు రూ.2,87,000 కోట్లకు చేరింది. అందులో కొంత భాగంతో యూపీఐ వ్యవస్థను నిలకడగా నడిపే వనరులు, సామర్థ్యం రిజర్వ్ బ్యాంక్‌కు ఉన్నాయి. అయితే, యూపీఐ లావాదేవీల నిర్వహణకు అయ్యే ఖర్చును ఎవరో ఒకరు భరించక తప్పదని ఆర్బీఐ గవర్నర్ ఇటీవల వ్యాఖ్యానించడం గమనార్హం.


**పరివర్తనకు విఘాతం**

యూపీఐ చెల్లింపు వ్యవస్థ ప్రజల్లోకి బాగా విస్తరించి ముందుకు సాగుతున్న క్రమంలో యూపీఐ వ్యాపార లావాదేవీలపై ఎండీఆర్ విధిస్తామనడం వల్ల నిలకడగా సాగుతున్న డిజిటల్ చెల్లింపుల వ్యవస్థపై ప్రభావం పడుతుంది. దాంతోపాటు, వ్యాపారులు ప్రతిఘటించే ప్రమాదమూ ఉంటుందనే విశ్లేషణలు వినిపిస్తున్నాయి. అంతేకాకుండా, నగదు ఆర్థిక వ్యవస్థ నుంచి డిజిటల్ ఆర్థిక వ్యవస్థకు పూర్తిస్థాయిలో పరివర్తన చెందే ప్రక్రియకు కూడా విఘాతం కలిగినట్లవుతుందనే విమర్శలు వస్తున్నాయి. గతంలో ఇలాంటి చర్యతో కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వం చేదు అనుభవాలను చవిచూసింది. ఇటీవలి రిజర్వ్ బ్యాంక్ ప్రకటన నేపథ్యంలో, ప్రజల్లో బాగా ఆదరణ పొందుతున్న యూపీఐలో వ్యాపారుల లావాదేవీలపై ఛార్జీల విధింపు అనవసరమే. అలాంటి రుసుములను విధిస్తే, వ్యాపారులు తమ లావాదేవీలను చిన్న, చిన్న మొత్తాలుగా విభజించి, పలు చెల్లింపులుగా చూపే అవకాశముంది. తద్వారా వారు తమ వాటాను కాపాడుకోవడమే కాకుండా లెక్కకు మిక్కిలి లావాదేవీలతో నెట్‌వర్క్‌పై ఒత్తిడి పెంచే ప్రమాదమూ ఉంది. అలా చేయకపోయినా, రుసుముల భారాన్ని వస్తూత్పత్తుల ధరల పెంపు రూపంలోనో మరో విధంగానో వినియోగదారులపైనే మోపే ప్రమాదమూ లేకపోలేదు. కాబట్టి ఈ విషయంలో ప్రజాప్రయోజనాలు, దేశ ఆర్థిక వ్యవస్థ బాగోగులను దృష్టిలో ఉంచుకుని అన్ని కోణాల్లో ఆలోచించి ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడమే సమంజసం.




# బీజేపీ మూడ్‌లో భారత్

సంచలనం రేపుతున్న ప్రజాభిప్రాయ సర్వే సంకేతాలు 'మోదీ 4.0'కు మార్గం సుగమమేనా? 2029 రాజకీయ సమీకరణాలపై 'మూడ్ ఆఫ్ ది నేషన్' అంచనాల ప్రభావం



**దేశ రాజకీయ భవిష్యత్‌పై అప్పుడే చర్చలకు తెరలేపేలా 'మూడ్ ఆఫ్ ది నేషన్' సర్వే గణాంకాలు ఆసక్తికర సంకేతాలను అందిస్తున్నాయి. "ఇండియా టుడే– సీ ఓటర్" ( C-Voter ) నిర్వహించిన తాజా ప్రజాభిప్రాయ సర్వే ప్రకారం... ఇప్పటికిప్పుడు లోక్‌సభ ఎన్నికలు జరిగితే నేషనల్ డెమోక్రటిక్ అలియెన్స్ (NDA) 326 స్థానాలతో మరోసారి అధికారాన్ని నిలబెట్టుకునే అవకాశం ఉంది. ముఖ్యంగా 2024 ఎన్నికల్లో 240 స్థానాలకు పరిమితమైన భారతీయ జనతా పార్టీ ఈసారి ఒంటరిగానే 261 స్థానాలు సాధించే అవకాశం ఉందన్న అంచనా రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఈ గణాంకాలు వాస్తవ ఎన్నికల ఫలితాలకు హామీ కాకపోయినా... ప్రస్తుత ప్రజాభిప్రాయంలో అధికార కూటమికి అనుకూలంగా ఉన్న ధోరణిని సూచిస్తోంది. ఇదే ఊపు 2029 వరకు కొనసాగితే... 'మోదీ 4.0' అవకాశాలపై ఇప్పటి నుంచే రాజకీయ విశ్లేషణలు మొదలయ్యే పరిస్థితి కనిపిస్తోంది.**

**మహారాష్ట్రలో పుంజుకుంటున్న ఎన్డీయే..**

మహారాష్ట్ర రాజకీయాల్లో చోటుచేసుకున్న పరిణామాలు ఎన్డీయేకి అనుకూలంగా మారుతున్నాయన్న సంకేతాలను సర్వే గణాంకాలు ఇస్తున్నాయి. రాష్ట్రంలోని మొత్తం రాజకీయ సమీకరణాల నేపథ్యంలో ఎన్డీయే 31 లోక్‌సభ స్థానాలు సాధించే అవకాశం ఉందని అంచనా వేయడం గమనార్హం. మహారాష్ట్రలో కూటముల మార్పులు, పార్టీల మధ్య విభజనలు, నాయకత్వ సమీకరణాలు... రానున్న ఎన్నికల్లో ఫలితాలను ప్రభావితం చేసే కీలక అంశాలుగా మారే అవకాశం ఉంది.

**పశ్చిమ బెంగాల్‌లో కమలానికి బలం ?**

తూర్పు భారతదేశంలో బీజేపీకి కీలకమైన పశ్చిమ బెంగాల్‌లోనూ సర్వే ఆసక్తికర అంచనాలను వెల్లడించింది. రాష్ట్రంలో ఎన్డీయే 35 స్థానాలు సాధించే అవకాశముందని పేర్కొనడం రాజకీయ పరిశీలకుల దృష్టిని ఆకర్షిస్తోంది.

ఇది నిజమైతే... పశ్చిమ బెంగాల్‌లో బీజేపీ తన రాజకీయ స్థానాన్ని మరింత బలపరచుకున్నట్లవుతుంది. అయితే రాష్ట్ర రాజకీయాల్లో తృణమూల్ కాంగ్రెస్ ప్రభావం, స్థానిక అంశాలు, ప్రతిపక్ష ఓట్ల సమీకరణ వంటి అంశాలు తుది ఫలితాల్లో కీలక పాత్ర పోషించనున్నాయి.

**ఉత్తరప్రదేశ్‌లో ప్రతిపక్షానికి స్వల్ప ఆధిక్యం...**

దేశ రాజకీయాల్లో అత్యంత కీలకమైన ఉత్తరప్రదేశ్ రాష్ట్రం మాత్రం బీజేపీకి ఇప్పటికీ సవాల్ విసురుతున్నట్లుగానే కనిపిస్తోంది. సర్వే అంచనాల ప్రకారం రాష్ట్రంలో 'ఇండీ కూటమి' 41 స్థానాలతో స్వల్ప ఆధిక్యంలో ఉండగా, ఎన్డీయే 38 స్థానాలకు పరిమితమయ్యే అవకాశం కనిపిస్తోంది.

లోక్‌సభలో అత్యధిక స్థానాలు కలిగిన ఉత్తరప్రదేశ్‌లో కొన్ని స్థానాల తేడా కూడా జాతీయ రాజకీయాలపై గణనీయమైన ప్రభావాన్ని చూపుతుంది. అందువల్ల 2029 లక్ష్యంగా పెట్టుకున్న బీజేపీకి ఉత్తరప్రదేశ్‌లో తన బలాన్ని మరింత పెంచుకోవడం అత్యంత ఆవశ్యకం కానుంది.

**పంజాబ్‌లో ప్రతిపక్ష ఆధిపత్యం**

పంజాబ్‌లో మాత్రం పరిస్థితి ఎన్డీయేకి అంత అనుకూలంగా కనిపించడం లేదు. సర్వే ప్రకారం "ఇండీ కూటమి" 11 స్థానాల్లో ఆధిక్యం సాధించే అవకాశం ఉండగా, ఎన్డీయే కేవలం ఒక్క స్థానానికే పరిమితమయ్యే పరిస్థితి కనిపిస్తోంది.

దేశవ్యాప్తంగా ఎన్డీయేకు అనుకూల వాతావరణం ఉన్నప్పటికీ... పంజాబ్ వంటి రాష్ట్రాల్లో బీజేపీ తన రాజకీయ విస్తరణను పెంచుకోవాల్సిన అవసరం ఉందని ఈ గణాంకాలు సూచిస్తున్నాయి.

**మోదీ పనితీరుకు ప్రజామద్దతు**

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పనితీరుపై 51 శాతం మంది ప్రజలు పూర్తిగా సంతృప్తి వ్యక్తం చేయడం అధికార కూటమికి కీలకమైన అంశంగా కనిపిస్తోంది.

2024 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ సొంతంగా మెజారిటీకి దూరమైనప్పటికీ... ప్రస్తుత సర్వేలో ఆ పార్టీ 261 స్థానాలకు చేరుకునే అవకాశం ఉందన్న అంచనా, గత రెండేళ్ల రాజకీయ పరిణామాలపై ప్రజాభిప్రాయంలో కొంత మార్పు చోటుచేసుకోనున్నదనే సంకేతాన్ని ఇస్తోంది.

**2029కు ఇప్పటి నుంచే 'బిగ్ ఫైట్' ?**

అయితే ఎన్నికలకు ఇంకా సమయం ఉన్న నేపథ్యంలో ప్రస్తుత సర్వే ఫలితాలను తుది తీర్పుగా చూడటం రాజకీయంగా తొందరపాటు అవుతుంది. ప్రజాభిప్రాయం ఎప్పుడైనా మారవచ్చు. ప్రభుత్వ పనితీరు, ఆర్థిక పరిస్థితులు, నిరుద్యోగం, ధరల పెరుగుదల, సంక్షేమ పథకాలు, రాష్ట్రాల వారీ రాజకీయ సమీకరణాలు, ప్రతిపక్ష ఐక్యత వంటి అనేక అంశాలు 2029 ఎన్నికల నాటికి కీలకంగా మారవచ్చు.

ముఖ్యంగా ఉత్తరప్రదేశ్, పంజాబ్ వంటి రాష్ట్రాల్లో బీజేపీ తన స్థితిని మెరుగుపరుచుకోవడంతో పాటు.. మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్ వంటి రాష్ట్రాల్లో కనిపిస్తున్న అనుకూల ధోరణిని ఓట్లుగా మలచుకోవాల్సి ఉంటుంది.

అదే సమయంలో ప్రతిపక్ష కూటమి కూడా ఈ సర్వే సంకేతాలను హెచ్చరికగా తీసుకుని క్షేత్రస్థాయిలో మరింత బలమైన వ్యూహాన్ని రూపొందించాల్సి ఉంటుంది. నాయకత్వం, సీట్ల సర్దుబాటు, రాష్ట్రాల వారీ పొత్తులు, ప్రభుత్వ వ్యతిరేక ఓట్ల ఏకీకరణ వంటి అంశాలపై ఇప్పటి నుంచే దృష్టి సారించాల్సి ఉంటుంది.

**సర్వే చెప్పే అసలు సందేశం**

మొత్తంగా చూస్తే.. ప్రస్తుత ప్రజాభిప్రాయంలో ఎన్డీయేకు ఆధిక్యం ఉన్నట్లు 'మూడ్ ఆఫ్ ది నేషన్' అంచనాలు సూచిస్తున్నాయి. 2024లో కనిపించిన సీట్ల లోటును బీజేపీ కొంతమేర పూడ్చుకుని తిరిగి పుంజుకునే అవకాశాలు ఉన్నాయన్న సంకేతాలు ఈ సర్వే ద్వారా వెలువడుతున్నాయి.

అయితే 2029 ఎన్నికల విజయం ఇప్పుడే నిర్ణయించబడదు. రాజకీయాల్లో రెండేళ్లు కూడా చాలా సుదీర్ఘ కాలమే. పరిస్థితులు, పొత్తులు, నాయకత్వాలు, ప్రజా సమస్యలు ఏ క్షణంలోనైనా సమీకరణాలను మార్చగలవు.

ప్రస్తుత గణాంకాలు 'మోదీ 4.0'కు అనుకూల సంకేతాలు ఇస్తున్నా.. 2029లో ఆ సంకేతాలు ఓట్లుగా, సీట్లుగా మారుతాయా ? అన్నదే ఇక్కడ అసలు ప్రశ్న.

(పులివారి హరిప్రసాద్)

# త్రైపాక్షిక ఒప్పందం... భారత్‌పైనా ప్రభావం!

**సౌదీ అరేబియా, తుర్కియే, పాకిస్థాన్‌ల మధ్య ఇటీవల మక్కాలో సంయుక్త రక్షణ ఒప్పందం కుదిరింది. అసలు దీని అవసరం ఎందుకు ఏర్పడింది? ఈ ఒడంబడిక వల్ల ఆశించిన ఫలితాలు సిద్ధిస్తాయా అన్నవి ఆసక్తికరంగా మారాయి.అణ్వస్త్ర దేశమైన పాకిస్థాన్, నాటో సభ్య దేశమైన తుర్కియే, చమురు నిల్వలతో సుసంపన్నమైన సౌదీ అరేబియా మధ్య సంయుక్త రక్షణ ఒప్పందం ముడివడటం ప్రపంచవ్యాప్తంగా చర్చల్లో నిలిచింది. అచ్చం నాటో మాదిరిగానే 'సభ్య దేశాల్లో ఏ ఒక్కదానిపై దాడి జరిగినా అది తమందరిపై జరిగిన దాడిగా మిగిలినవి భావిస్తాయి' అనే నిబంధనను ఈ ఒప్పందంలో చేర్చారు. నిరుడు సౌదీ, పాకిస్థాన్‌ల మధ్య కుదిరిన భద్రతా ఒప్పందానికి తాజా మక్కా ఒడంబడిక పొడిగింపు. ముస్లిములకు పవిత్ర ప్రదేశాలైన మక్కా, మదీనాల సంరక్షక హోదాలో సౌదీ అరేబియా, 'ఒట్టోమన్ సామ్రాజ్య' వారసత్వంతో తుర్కియే ఇస్లామిక్ ప్రపంచానికి సారథ్యం వహించాలని పోటీపడుతున్నాయి. అవి రెండూ త్రైపాక్షిక ఒప్పందం కింద ఒకటవడం చిత్రంగా ఉంది. నిజానికి సౌదీ కన్నా ముందే తుర్కియేతో పాకిస్థాన్ సన్నిహిత సంబంధాలు ఏర్పరచుకుంది. తుర్కియే కశ్మీర్ విషయంలో పాకిస్థాన్‌కు మద్దతిస్తూ వస్తోంది. 'ఆపరేషన్ సిందూర్' సమయంలో డ్రోన్లు, ఇతర రక్షణ సామగ్రిని పాక్‌కు సరఫరా చేసింది. ఇరాన్-అమెరికా యుద్ధాన్ని అనుకూలంగా మార్చుకుని పాకిస్థాన్ తాజా త్రైపాక్షిక ఒప్పందంలో సౌదీ, తుర్కియేలను భాగస్వాములుగా మార్చగలిగింది. భారత్‌ను అస్థిరపరచాలని చూస్తున్న ఉగ్రవాదులకు పాక్ మద్దతిస్తున్నందుకు ప్రతిగా 'ఆపరేషన్ సిందూర్'తో ఇస్లామాబాద్‌ను దిల్లీ చావుదెబ్బ కొట్టింది. భవిష్యత్తులో మళ్లీ అలాంటి దాడి జరగకుండా అడ్డుకోవడానికి మక్కా ఒప్పందం ఉపకరిస్తుందని పాకిస్థాన్ భావిస్తోంది. దక్షిణాసియా, గల్ఫ్, ఐరోపాలలోని మూడు దేశాలను రక్షణపరంగా ఒక తాటిపైకి తేవాలని చూస్తున్న ఈ ఒప్పందం ఆచరణలో ఎంతవరకు సఫలమవుతుందన్నది అనుమానమే.**



**యూఏఈ స్వతంత్ర మార్గం**

ఈ ఏడాది ఫిబ్రవరిలో ఇరాన్‌ఇజ్రాయెల్అమెరికా యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి మొత్తం పశ్చిమాసియాలో భౌగోళిక రాజకీయ సమతుల్యత మారసాగింది. గత యాభై ఏళ్లుగా గల్ఫ్ దేశాలు తమ రక్షణ కోసం పూర్తిగా అమెరికాపై ఆధారపడుతూ వచ్చాయి. ఆ దేశాల్లో చాలాచోట్ల అమెరికాకు సైనిక స్థావరాలున్నాయి. సౌదీ, యూఏఈ, ఖతార్ వంటి ప్రధాన దేశాలకు ఆయుధాలను, నిఘా పరికరాలను, టెక్నాలజీని అమెరికా విక్రయిస్తోంది. కానీ, అమెరికాతో యుద్ధ సమయంలో హార్మూజ్ జలసంధిని ఇరాన్ దిగ్బంధించడంతో పాటు తమపై క్షిపణులు, డ్రోన్లతో దాడికి దిగడంతో గల్ఫ్ దేశాలకు వాటి భద్రత ఎంత పెళుసుగా ఉందో తెలిసివచ్చింది. తమకు ముప్పు వాటిల్లకుండా వాషింగ్టన్ కాపాడగలదన్న నమ్మకం వాటిలో సన్నగిల్లింది. ఇలాంటి పరిస్థితుల్లో మక్కా త్రైపాక్షిక ఒప్పందం తన భద్రతకు అక్కరకొస్తుందన్నది సౌదీ ఆశ. అయితే ఈ కూటమి ఏ ఇతర దేశానికీ వ్యతిరేకం కాదని ముందుగానే స్పష్టం చేశారు. ఇజ్రాయెల్‌ను దృష్టిలో ఉంచుకుని ఈ హామీ ఇచ్చినట్లుంది. తద్వారా మక్కా ఒప్పందానికి అమెరికా ఆశీస్సులు లభిస్తాయి. ఈ క్రమంలోనే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఈ ఒడంబడికను స్వాగతించడం గమనార్హం.

వాస్తవంలో సౌదీ, పాక్, తుర్కియేలు ఇజ్రాయెల్‌కు, ఈ ప్రాంతంలో ఆ దేశ విధానాలకు వ్యతిరేకమనేది జగమెరిగిన సత్యం. మరోవైపు సౌదీ, యూఏఈల మధ్య సంబంధాలు ఇటీవల దెబ్బతిన్నాయి. భద్రతా ఒప్పందంలో యూఏఈ భాగస్వామి కాకపోవడానికి ఇదే కారణం కావచ్చు. ఇరాన్‌అమెరికా యుద్ధ సమయంలో యూఏఈ ఒపెక్ నుంచి వైదొలగి, ఇరాన్‌తో సంబంధాలను స్వతంత్రంగా నిర్వహించుకుంటోంది. యుద్ధం ముమ్మరంగా సాగుతున్న వేళ ఒక ఉన్నత స్థాయి యూఏఈ ప్రతినిధి బృందం టెహ్రాన్‌ను సందర్శించి, ఇరాన్ తమపై దాడులు చేయకుండా హామీ తీసుకున్నట్లు వార్తలొచ్చాయి. అందుకే యుద్ధం తరవాతి దశలో ఇరాన్ తన దాడులను ఎక్కువగా కువైట్, బహ్రెయిన్, కొంతవరకు ఖతార్‌లపైకి ఎక్కుపెట్టింది. శాంతిభద్రతలను కాపాడుకోవడం మీదనే యూఏఈ ఆర్థిక వ్యవస్థ ఆధారపడి ఉంది. ఇజ్రాయెల్ విషయానికొస్తే, మక్కా ఒప్పందం సౌదీ అరేబియాతో సంబంధాల సాధారణీకరణను ఆలస్యం చేస్తుంది. ఇజ్రాయెల్ ఈ ఒప్పందాన్ని వ్యూహపరమైన ముప్పుగా పరిగణిస్తుంది. అయితే సౌదీని అమెరికా అదుపులో పెట్టగలదు కాబట్టి ఇజ్రాయెల్ ఏదో ఒక విధంగా సర్దుబాటు చేసుకోవచ్చు. ఇది ఇజ్రాయెల్‌కు వ్యూహపరంగా ప్రయోజనకరం కూడా.

**మరో కూటమి రావొచ్చు...**



పాకిస్థాన్ ప్రమేయం ఉన్నందువల్ల త్రైపాక్షిక రక్షణ ఒప్పందం కచ్చితంగా భారతదేశంపై ప్రభావం చూపుతుంది. అయితే, సౌదీతో ఇండియాకు సన్నిహిత సంబంధాలున్నాయి. పాకిస్థాన్‌కు మద్దతు ఇస్తున్నందువల్ల భారత్‌తుర్కియే సంబంధాలు అంత స్నేహపూర్వకంగా లేవు. గతేడాది సౌదీపాక్‌లు భద్రతా ఒప్పందంపై సంతకాలు చేసినప్పటికీ, తరవాత పాక్‌అఫ్గానిస్థాన్‌ల మధ్య సంఘర్షణ తలెత్తినప్పుడు రియాద్ నుంచి ఇస్లామాబాద్‌కు ఎలాంటి బహిరంగ మద్దతు లభించలేదు. అయినా సౌదీ ఆర్థిక అండదండలు స్వీయ సంక్షోభ నివారణకు పాక్‌కు తోడ్పడతాయి. తాజా ఒప్పందం ఇస్లామిక్ నాటోకు శ్రీకారం చుడుతోందనే వాదనా వినిపిస్తోంది. ఈ ఒడంబడిక క్రమేణా మరిన్ని సభ్యదేశాలను ఆకర్షించే అవకాశం ఉంది. దీనికి పోటీగా ఈ ప్రాంతంలో భావసారూప్యత గల దేశాలతో మరో కూటమి ఏర్పాటుకు యూఏఈ నాయకత్వం వహించే అవకాశం లేకపోలేదు. ఇండియామిడిల్ ఈస్ట్‌యూరోప్ ఎకనామిక్ కారిడార్ (ఐమెక్), ఐ2యు2 కింద భారత్‌యూఏఈల మధ్య అత్యంత సన్నిహిత సంబంధాలున్నాయి.

## సురక్షితంగా స్వస్థలాలకు

# చేరుకున్న 21 మంది



- నేపాల్ వరదల నుంచి సేఫ్‌గా..
- విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్
- 21 మంది తమిళనాడుకు చెందినవారే..

**అమరావతి, ఆగస్ట్ 28, అనంతజనశక్తి న్యూస్**

నేపాల్‌లోని వరద ప్రభావిత ప్రాంతాల నుంచి 21 మంది భారతీయులు సురక్షితంగా దేశ రాజధాని ఢిల్లీ చేరుకున్నారని కేంద్ర విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ వెల్లడించారు. వీరంతా వారి స్వస్థలం తమిళనాడు చేరుకున్నారని వివరించారు. శుక్రవారం న్యూఢిల్లీలో ఆయన మాట్లాడుతూ..నేపాల్‌లోని త్రిశూలి హైడ్రో పవర్ ప్రాజెక్టులో పని చేస్తున్న 63 మంది భారతీయులను కూడా రక్షించారని తెలిపారు. అయితే నేపాల్ వరదలకు 320 మంది భారతీయులు, 100 మంది ఎన్నారైలు గల్లంతయ్యారని చెప్పారు. కైలాస మానస సరోవర యాత్రకు వెళ్లి వీరంతా గల్లంతయ్యారని పేర్కొన్నారు. అయితే చైనా వైపు టిబెట్‌లో 400 మంది భారతీయులు సురక్షితంగా ఉన్నారని అన్నారు. వారందరితో భారత రాయబార కార్యాలయం సంబంధాలు కలిగి ఉందని తెలిపారు. త్వరలో వారందరూ భారత్‌కు తిరిగి వచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు కేంద్ర విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ చెప్పారు.

**315 మంది భారతీయుల ఆచూకీ గల్లంతు**

నేపాల్ వరదల్లో పలువురు భారతీయులు ఆచూకీ లభించడం లేదు. సుమారుగా 315 మంది భారతీయుల ఆచూకీ గల్లంతైనట్లు భారత విదేశాంగ శాఖ ప్రకటించింది. ఇప్పటి వరకు వివిధ ప్రాంతాల నుంచి 85 మంది భారతీయుల్ని రక్షించినట్లు చెప్పింది. ఇదిలా ఉంటే చైనాలోని టిబెట్ ప్రాంతం నుంచి 93 మంది భారతీయులు నేపాల్ చేరుకున్నారు. నేపాల్ నుంచి ఢిల్లీకి వచ్చిన భారతీయులను విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ పలకరించారు.

విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ మాట్లాడుతూ, సుమారు 400 మంది భారత పౌరులు చైనా వైపు చిక్కుకుపోయారని తెలిపారు. వారందరూ సురక్షితంగా ఉన్నారని, తమ కుటుంబాలతో సంప్రదింపులు జరుపుతున్నారని చెప్పారు. బీజింగ్‌లోని భారత రాయబార కార్యాలయం కూడా వారితో సంప్రదింపులు జరుపుతోంది. చాలా మంది కుటుంబాలు హెల్ప్‌లైన్ ద్వారా రాయబార కార్యాలయాన్ని సంప్రదించాయి. అక్కడ నుంచి భారత్ రప్పించేందుకు చైనాలోని స్థానిక అధికారులతో సంప్రదింపులు జరుపుతోంది.

**గల్లంతైన వారి జాబితా విడుదల**

నేపాల్‌టిబెట్ సరిహద్దు వద్ద వరదల్లో పడి 552 మంది మరణించారు. 547 మంది మృతుల వివరాలను నేపాల్ ప్రకటించగా మరో ఐదు మరణాల గురించి చైనా మీడియా వెల్లడించింది. ఈ ప్రమాదంలో 1400 మందికి పైగా గల్లంతయ్యారు. వీరిలో 178 మంది భారతీయులు సహా 644 మంది వివరాలను నేపాల్ పోలీసులు వెల్లడించారు. గల్లంతైన వారిలో ఇతర దేశాల వారు కూడా ఉన్నారు. వీరి జాబితాను తాజాగా విడుదల చేశారు.

అయితే, నేపాల్‌లో సుమారు 320 మంది భారతీయులు గల్లంతైనట్లు విదేశాంగ శాఖ తాజాగా తెలిపింది. మరో వందమంది భారత సంతతి వారి ఆచూకీ కూడా తెలియలేదని తెలిపింది. విదేశాంగ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ ఈ విషయాలను వెల్లడించారు. తమిళనాడుకు చెందిన 21 మంది వరదప్రభావిత ప్రాంతాల నుంచి స్వదేశానికి చేరుకున్నారని కూడా చెప్పారు. త్రిశూలీ పవర్ ప్రాజెక్టులో పనిచేస్తున్న 63 మంది భారతీయులు సురక్షితంగానే ఉన్నారని కూడా రణధీర్ జైస్వాల్ తెలిపారు.

ఇక వరదల కారణంగా చైనాలో ఉండిపోయిన సుమారు 400 మంది భారతీయులు క్షేమంగానే ఉన్నారని కూడా విదేశాంగ శాఖ ప్రతినిధి చెప్పారు. వారిలో చాలా మంది హెల్ప్‌లైన్‌ల ద్వారా భారతీయ ఎంబసీని సంప్రదించారని అన్నారు. 96 మంది ఇప్పటికే నేపాల్‌కు చేరుకున్నారని చెప్పారు. వారిని భారత్‌కు తరలించేందుకు ప్రయత్నాలు చేస్తున్నామని చెప్పారు. మిగిలిన వారినీ తీసుకొచ్చేందుకు అక్కడి అధికారులతో సంప్రదింపులు జరుపుతున్నామని చెప్పారు. అయితే, మృతులు, గల్లంతైన వారి పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.

# తనిఖీలు చేయండి

(మొదటి పేజీ తరువాయి)



ఇది కాస్తా పవన్ కళ్యాణ్ దృష్టికి వెళ్లడంతో ఆయన స్పందించారు. బాలాజీ యాక్షన్ బిల్డ్ వెల్ పరిశ్రమలో తనిఖీలు నిర్వహించాలని కాలుష్య నియంత్రణ మండలి (పీసీబీ) అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు కాలుష్య నియంత్రణ మండలి అధికారులు బాలాజీ యాక్షన్ బిల్డ్ వెల్ సంస్థలో తనిఖీలు చేపట్టారు. పరిశ్రమలో యంత్ర పరికరాల ట్రయల్ రన్ సందర్భంగా కలప వ్యర్థాలను ఇంధనంగా వినియోగిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. ఈ ప్రక్రియలో బాయిలర్ నుంచి వెలువడుతున్న కాలుష్య వాయువులు అత్యవసర ద్వారం ద్వారా సమీపంలోని గ్రామాల వైపు వ్యాపిస్తున్నట్లు పీసీబీ అధికారుల పరిశీలనలో తేలింది. బాయిలర్ నుంచి వెలువడే ఉద్గారాలను నియంత్రించేందుకు నిబంధనల ప్రకారం మల్టీసైక్లోన్ డస్ట్ కలెక్టర్ అనే వాయు కాలుష్య నియంత్రణ పరికరాన్ని ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. దీన్ని బాయిలర్ పొగ గొట్టానికి అనుసంధానం చేసి.. శుద్ధి చేసిన ఉద్గారాలను తగిన ఎత్తు కలిగిన చిమ్నీ ద్వారా బయటకు పంపాల్సి ఉంటుంది. అయితే యంత్రాల ప్రీ కమిషనింగ్ ప్రక్రియలో బాలాజీ యాక్షన్ బిల్డ్ వెల్ సంస్థ ఈ నిబంధనలను పూర్తిస్థాయిలో పాటించడం లేదని కాలుష్య నియంత్రణ మండలి అధికారులు గుర్తించారు. దీంతో కాలుష్య నియంత్రణ పరికరాలను ఏర్పాటు చేసిన తర్వాతే పరిశ్రమ కార్యకలాపాలను కొనసాగించాలని సంస్థ యాజమాన్యానికి అధికారులు సూచించారు. చిమ్నీ ఏర్పాటు సహా ఇతర పనులు పూర్తి చేసేందుకు బాలాజీ యాక్షన్ బిల్డ్ వెల్ సంస్థ యాజమాన్యం 20 రోజుల గడువు కోరినట్లు పీసీబీ అధికారులు తెలిపారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన కాలుష్య నియంత్రణ చర్యలు పూర్తిచేసిన తర్వాతే కమిషనింగ్ ప్రక్రియను ప్రారంభించేందుకు అనుమతి ఇచ్చినట్లు వెల్లడించారు. గ్రామస్థుల ఫిర్యాదును వెంటనే పరిగణనలోకి తీసుకుని అధికారులు తనిఖీలు చేపట్టడంతో స్థానికుల్లో హర్షాతిరేకాలు వ్యక్తం అవుతున్నాయి. పరిశ్రమల కార్యకలాపాల కారణంగా ప్రజల ఆరోగ్యం, పర్యావరణానికి ఇబ్బందులు కలగకుండా కాలుష్య నియంత్రణ నిబంధనలను కఠినంగా అమలు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికలను

# అడ్డుకునే కుట్ర!

**అమరావతి, ఆగస్ట్ 28, అనంతజనశక్తి న్యూస్**

స్థానిక ఎన్నికలు జరగడం గొడ్డలిపార్టీ నాయకుడికి ఇష్టం లేదని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. ఈ మేరకు మంగళగిరిలోని ఎన్టీఆర్ భవన్‌లో సీఎం చంద్రబాబు చిట్‌చాట్‌గా మాట్లాడారు. స్థానిక ఎన్నికలను అడ్డుకునేందుకు వైకాపా అధినేత జగన్ యత్నిస్తున్నట్లు విమర్శించారు. ఎన్నికలు వాయిదా పడితే.. ఆ పార్టీకి లాభం అనుకోవడం దింపుడుకళ్లెం ఆశలే అన్నారు. స్థానిక ఎన్నికలు ప్రత్యక్ష పద్ధతిలో జరిగితేనే రాజకీయ స్థిరత్వం ఉంటుందన్నారు. ఏ ఎన్నికల్లోనైనా బీసీలకు ఎక్కువ సీట్లు ఇచ్చేది తెదేపానేని పేర్కొన్నారు. బీసీలకు 34 శాతం సీట్లు అనేది చట్టపరమైన రక్షణ మాత్రమే అని సీఎం పేర్కొన్నారు. గత ఎన్నికల్లో 34 శాతం కంటే ఎక్కువ సీట్లే బీసీలకు ఇచ్చినట్లు తెలిపారు.

వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను ఏదో ఒక విధంగా అడ్డుకోవడానికి కుట్రలు చేస్తున్నారని ఆయన తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ఇదే క్రమంలో రాయలసీమ, ప్రకాశం జిల్లాలకు దశాబ్దాల కల అయిన వెలిగొండ ప్రాజెక్టును పూర్తి చేయడం ఒక చారిత్రాత్మక ఘట్టమని అభివర్ణించారు. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారమే మార్కాపురంను నూతన జిల్లాగా ప్రకటించడమే కాకుండా, ఆ ప్రాంతాన్ని వ్యవసాయపరంగా, ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు వీలుగా మార్కాపురం జిల్లాను ప్రతిష్టాత్మక హార్టీకల్చర్ హబ్‌లో చేర్చామని సీఎం చంద్రబాబు వివరించారు.

రాష్ట్రంలో నీటిపారుదల ప్రాజెక్టులను వేగవంతంగా పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించడమే తమ ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని చంద్రబాబు స్పష్టం చేశారు. అందులో భాగంగానే ఈ ఏడాది సెప్టెంబర్ 2వ తేదీన అత్యంత కీలకమైన పోలవరం ప్రాజెక్ట్ లెఫ్ట్ కెనాల్‌కు అధికారికంగా 'జలహారతి' కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆయన ప్రకటించారు. ప్రతికూల పరిస్థితులు ఉన్నప్పటికీ నీటి నిర్వహణను సమర్థవంతంగా చేపడుతూ పంటలకు నీరు అందిస్తున్నామని తెలిపారు. వైఎస్సార్‌సీపీ ఎన్ని అడ్డంకులు సృష్టించాలని చూసినా సంక్షేమం, అభివృద్ధి, ప్రాజెక్టుల పూర్తి దిశగా తమ కూటమి ప్రభుత్వం తగ్గేదేలేదని సీఎం చంద్రబాబు తేల్చిచెప్పారు.


**వెలిగొండ నిర్వాసితులకు శుభవార్త**

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం వెలిగొండ ప్రాజెక్టు నిర్వాసితుల విషయంలో అత్యంత కీలకమైన నిర్ణయం తీసుకుంది. ప్రాజెక్టు పరిధిలో భూములు, ఆస్తులు కోల్పోయిన వారందరికీ తగిన సాయం అందించి, పూర్తిస్థాయిలో భరోసా నింపాలని ప్రభుత్వం నిర్ణయించింది. గతంలో నిర్ణయించిన కటాఫ్ డేట్ తర్వాత కూడా అర్హత పొందిన ప్రతి ఒక్కరికీ ఎక్స్ గ్రేషియా అందించేలా సీఎం స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. గెజిట్ లేదా సోషియో ఎకనామిక్ సర్వేలో నమోదు కాకపోయినా, అలాగే అవార్డు పాస్ కాని అర్హులైన యువతకు కూడా న్యాయం జరగాలని స్పష్టం చేశారు. క్రమంలో 2019 కటాఫ్ డేట్ నుంచి 2026 నాటికి 18 సంవత్సరాలు నిండిన యువతను కూడా అర్హులుగా గుర్తించారు. వారికి ప్రతి ఒక్కరికీ రూ. 2 లక్షల చొప్పున ఎక్స్ గ్రేషియా చెల్లించడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. నిర్వాసితులకు ఇప్పటికే అందించిన పరిహారానికి అదనంగా మొత్తం రూ. 169 కోట్ల ఎక్స్ గ్రేషియాను విడుదల చేయనున్నారు. అలాగే.. నిర్వాసిత కుటుంబాలకు నెల రోజులకు సరిపడా రేషన్ కిట్లను కూడా అందించాలని సీఎం ఆదేశించారు. ఇప్పటికే 7,027 నిర్వాసిత కుటుంబాలకు రూ. 905 కోట్ల విలువైన పునరావాస ప్యాకేజీని అందించినట్లు అధికారులు స్పష్టం చేశారు.

ఈ నిర్ణయాల వివరాలను జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు వెల్లడించారు. దేశంలో ఏ ప్రాజెక్టులోనూ ఇవ్వనంతటి భరోసాను వెలిగొండ నిర్వాసితులకు ఇస్తున్నామని తెలిపారు. అర్హుల జాబితాలో చేర్చాలంటూ ప్రభుత్వానికి వచ్చిన సుమారు 1,800 గ్రీవెన్సులు, పిటిషన్లను క్షుణ్ణంగా పరిశీలించి ప్రతి ఒక్కరికీ న్యాయం చేస్తామని ఆయన పేర్కొన్నారు. ఆగస్టు 31న వెలిగొండ ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేయడంతో పాటు, చివరి నిర్వాసితుడికి పరిహారం అందే వరకు ఈ ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని తెలిపారు. నిర్వాసిత కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు, నీటి నిర్వహణను సమర్థవంతంగా చేపడతామని స్పష్టం చేశారు.

## సోనియా గాంధీ పుస్తకంపై

## సెన్సార్‌షిప్ కలకలం



- 'బిలాంగింగ్ ఎ జర్నీ ఆఫ్ లవ్' బుక్
- ప్రచురణలో పెంగ్విన్ ఇండియా నిరాకరణ
- మోదీ, ఆర్ఎస్ఎస్, చైనా చొరబాట్లపై..
- రాసిన భాగాలను తొలగించేందుకు సోనియా నో
- ప్రింటింగ్ ఒప్పందం రద్దు చేసుకున్న పెంగ్విన్

కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ ఆత్మకథ ప్రచురణ వ్యవహారం ఇప్పుడు దేశ రాజకీయాల్లో తీవ్ర దుమారం రేపుతోంది. ఆమె రాసిన 'బిలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్' పుస్తకం నుంచి ప్రధాని నరేంద్ర మోదీ, ఆర్ఎస్ఎస్, చైనా చొరబాట్లకు సంబంధించిన కీలక అంశాలను తొలగించాలని ప్రచురణ సంస్థ పెంగ్విన్ రాండమ్ హౌస్ ఇండియా ఒత్తిడి తెచ్చింది. అయితే, తన జీవితకథలో ఎలాంటి మార్పులు లేదా తొలగింపులకు ఒప్పుకునేది లేదని సోనియా తేల్చిచెప్పడంతో ఆ సంస్థతో ఒప్పందం రద్దయింది.

**ఆల్ఫ్రెడ్ ఏ నాఫ్ ఆధ్వర్యంలో గ్లోబల్ రిలీజ్**

పెంగ్విన్ ఇండియా వెనక్కి తగ్గినప్పటికీ, పెంగ్విన్ అంతర్జాతీయ విభాగమైన 'ఆల్ఫ్రెడ్ ఏ నాఫ్' ఈ పుస్తకాన్ని నవంబర్ 10న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయడానికి నిశ్చయించింది. భారత్‌లో ఈ పుస్తక ప్రచురణ, పంపిణీ హక్కుల కోసం హార్పర్ కాలిన్స్ సంస్థ వేగంగా అడుగులు వేస్తోంది. 79 ఏళ్ల సోనియా గాంధీ తన రాజకీయ ప్రస్థానంలో ఎదురైన అనుభవాలు, ప్రధాని మోదీతో భేటీలకు సంబంధించిన వివరాలను పుస్తకంలో సమగ్రంగా పొందుపరిచారు. ముఖ్యంగా 2004 గుజరాత్ ఎన్నికల ప్రచారంలో మోదీ తనను ఉద్దేశించి చేసిన "జెర్సీ ఆవు" వ్యాఖ్యల ప్రస్తావనను కూడా ఆమె గుర్తుచేసుకున్నారు.

చైనా చొరబాట్లు, ఆర్ఎస్ఎస్‌పై వివాదాస్పద భాగాలు ప్రధాని మోదీతో పాటు ఆర్ఎస్ఎస్ సిద్ధాంతాలు, సరిహద్దుల్లో చైనా చొరబాట్లపై సోనియా రాసిన భాగాలపై పెంగ్విన్ ఇండియా తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేసింది. ప్రధానంగా 34 పేరాలను పూర్తిగా తొలగించాలని పట్టుబట్టింది. ప్రధాని మోదీని ఇతర మాజీ ప్రధాన మంత్రులతో పోలుస్తూ సోనియా చేసిన విశ్లేషణలు, వాస్తవ నియంత్రణ రేఖ వద్ద చైనా ఆక్రమణలపై రాసిన పాఠాలు వివాదానికి మూలంగా మారాయి. లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, సోనియా గాంధీలు గతంలోనూ సరిహద్దు భద్రతపై కేంద్ర ప్రభుత్వ వైఖరిని గట్టిగా ప్రశ్నించిన సంగతి తెలిసిందే.

**పెంగ్విన్ వివరణ.. కాంగ్రెస్ ఘాటు కౌంటర్**

**ఈ వివాదంపై పెంగ్విన్ రాండమ్ హౌస్ ఇండియా స్పందిస్తూ.. "ఎడిటోరియల్ మార్పుల ప్రతిపాదనల వల్లే పుస్తకాన్ని ప్రచురించడం లేదనుకోవడం సరికాదు. పుస్తక నాణ్యతను కాపాడటం, ఫ్యాక్ట్-చెక్ చేయడం ప్రచురణకర్తగా మా బాధ్యత" అని వివరణ ఇచ్చింది. అయితే ఈ వాదనను కాంగ్రెస్ తీవ్రంగా తోసిపుచ్చింది. "గ్లోబల్ పెంగ్విన్ సంస్థ పుస్తకాన్ని ప్రచురిస్తున్నప్పుడు, ఇండియా పెంగ్విన్ ఫ్యాక్ట్-చెక్ పేరు చెప్పడం విడ్డూరంగా ఉంది" అని ఎద్దేవా చేసింది. కాంగ్రెస్ నేత గౌరవ్ గొగొయ్ స్పందిస్తూ.. "పీఎం మోదీ రాసిన 'ఎగ్జామ్ వారియర్స్', ఆర్ఎస్ఎస్‌పై పుస్తకాలను ప్రచురించడానికి ఉత్సాహపడే పెంగ్విన్, ఇప్పుడు బీజేపీ ప్రభుత్వానికి భయపడి సోనియా పుస్తకం విషయంలో వెనకడుగు వేసింది," అని ఆరోపించారు.**

**గతంలో నరవణే పుస్తకంపై ఇలాగే వివాదం**

**పెంగ్విన్ సంస్థ గతంలో మాజీ ఆర్మీ చీఫ్ జనరల్ ఎంఎం నరవణే ఆత్మకథ విషయంలోనూ ఇదే తరహాలో వ్యవహరించింది. నరవణే రాసిన పుస్తకంలో చైనా చొరబాట్ల సమయంలో రాజకీయ నాయకత్వం త్వరితగతిన నిర్ణయం తీసుకోకుండా సైన్యాన్ని ఒంటరిని చేసిందని పేర్కొన్న భాగాలు తీవ్ర వివాదాస్పదమయ్యాయి. ఫిబ్రవరి బడ్జెట్ సమావేశాల్లో ఈ అంశంపై పార్లమెంట్‌లో రాహుల్ గాంధీ మాట్లాడేందుకు ప్రయత్నించగా, సభలో తీవ్ర గందరగోళం నెలకొంది.**




## మక్కాలో రాఖీ ప్రార్థనలు

## జెన్–జీకి ఉద్యోగాలు ఇవ్వాలని వేడుకోలు



- ఉమ్రా కోసం మరోసారి మక్కాకు..
- బురఖా, హిజాబ్ ధరించి ప్రార్థనలు చేసిన నటి
- నేపాల్ వరద బాధితుల కోసం కన్నీళ్లతో ప్రార్థనలు

**అమరావతి, ఆగస్ట్ 28, అనంతజనశక్తి న్యూస్**

బాలీవుడ్ నటి రాఖీ సావంత్ మరోసారి మక్కాకు వెళ్లారు. ఉమ్రా కోసం మక్కాకు వెళ్లిన ఆమె, నల్ల బురఖా ధరించి ప్రార్థనలు చేశారు. నేపాల్ వరదల్లో చిక్కుకున్న ప్రజల భద్రతతో పాటు భారతదేశంలో జెన్‌జీ యువత భవిష్యత్తు కోసం కన్నీటితో అల్లాను ప్రార్థించారు. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. రాఖీ సావంత్, ఆదిత్ ఖాన్ దుర్రానీని పెళ్లి చేసుకున్న తర్వాత ఇస్లాం మతాన్ని స్వీకరించారు.

మక్కా నుంచి రాఖీ షేర్ చేసిన వీడియోలో నేపాల్‌లో కొనసాగుతున్న వరదలు, ప్రకృతి విపత్తు ఆగిపోవాలని ప్రార్థించారు. పిల్లలు, వృద్ధులు, జంతువులు సురక్షితంగా ఉండాలని అల్లాను వేడుకున్నారు. వరదల్లో చిక్కుకున్న నేపాలీలు, భారతీయులు క్షేమంగా ఉండాలని కోరుకున్నారు. భారతదేశాన్ని కాపాడాలని, విద్యా వ్యవస్థను రక్షించాలని, జెన్‌జీ యువతకు పెద్ద సంఖ్యలో ఉద్యోగాలు రావాలని కోరుతూ అల్లాను వేడుకున్నారు. జెన్‌జీ యువతకు విద్యా, భవిష్యత్తు, ఆశీర్వాదాలు కలగాలని, దేశ మంత్రులు నిజాయితీతో వ్యవహరించాలని కూడా ప్రార్థించారు.

యువత తమ తల్లిదండ్రుల్ని ఇబ్బంది పెట్టొద్దని, ముఖ్యంగా ఖరీదైన వస్తువులు, ఐఫోన్ వంటి వాటి కోసం ఒత్తిడి చేయొద్దని సూచించారు. మీ జీవనోపాధిని మీరే సంపాదించుకోవాలని, మీ జీవితాన్ని మీరే జీవించాలని, మీ తల్లిదండ్రులకు సేవ చేయాలని యువతకు సందేశం ఇచ్చారు. అయితే, రాఖీ సావంత్ ప్రార్థనలకు మిశ్రమ స్పందన లభిస్తోంది. కొందరు ఆమె ప్రార్థనల్ని ప్రశంసించగా, మరికొందరు ఆమె మత మార్పు గురించి విమర్శలు చేస్తున్నారు.

## 23 రోజుల ఉత్కంఠకు తెర స్వగ్రామానికి చేరుకున్న

# ఓడలరేవు మత్స్యకారులు!

- ఈ నెల 3న సముద్రంలో వేటకు వెళ్లి
- ఏడుగురు మత్స్యకారులు క్షేమం

**అమరావతి, ఆగస్ట్ 28, అనంతజనశక్తి న్యూస్**

అంబేద్కర్ కోనసీమ జిల్లాలో 23 రోజులుగా కొనసాగుతున్న ఉత్కంఠకు ఎట్టకేలకు తెరపడింది. ఈ నెల 3న అల్లవరం మండలం ఓడలరేవు నుంచి సముద్రంలో వేటకు వెళ్లి ఆచూకీ లేకుండా పోయిన ఏడుగురు మత్స్యకారులు క్షేమంగా స్వగ్రామానికి చేరుకున్నారు. పశ్చిమ బెంగాల్‌లోని దిఘా తీరానికి చేరుకున్న అనంతరం.. అక్కడి నుంచి ప్రత్యేక వాహనంలో ముందుగా కాకినాడకు, ఆపై ఓడలరేవుకు అధికారులు తీసుకొచ్చారు.

మత్స్యకారులు గ్రామానికి చేరుకున్న వెంటనే కుటుంబ సభ్యులు, బంధువులు ఆనందభాష్పాలతో వారిని ఆప్యాయంగా హత్తుకుని స్వాగతం పలికారు. 23 రోజుల పాటు తమవారి ఆచూకీ తెలియక తీవ్ర ఆందోళనకు గురైన కుటుంబాల్లో ఇప్పుడు ఆనందం వెల్లివిరిసింది. ఇన్నాళ్ల నిరీక్షణకు తెరపడటంతో వారి ముఖాల్లో సంతోషం కనిపించింది. మత్స్యకారులు స్వగ్రామానికి వస్తున్నారన్న సమాచారంతో గ్రామస్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. గ్రామ ప్రవేశం సందర్భంగా వారికి పూలమాలలు వేసి, హారతులు ఇచ్చి ఘన స్వాగతం పలికారు. తమవారు క్షేమంగా తిరిగి రావడంతో ఓడలరేవు గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. సముద్రంలో ఆచూకీ లేకుండా పోయిన తమ గ్రామానికి చెందిన ఏడుగురు మత్స్యకారులు సురక్షితంగా తిరిగి రావడం పట్ల కుటుంబ సభ్యులు, గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

# సమస్యలను పరిష్కరిస్తాం

(మొదటి పేజీ తరువాయి)

**రాజమండ్రి పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో రూ.75 లక్షల వ్యయంతో చేపట్టనున్న రోడ్ల పనులకు శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీ పురందేశ్వరి, ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి, వైస్ ఛాన్స్‌లర్ మునిరత్నం నాయుడు పాల్గొన్నారు.**

**ఏపీ విభజన వల్ల పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయానికి అన్యాయం జరిగిందని తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి తెలిపారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో ఈ విశ్వవిద్యాలయం తీవ్ర నిర్లక్ష్యానికి గురైందని విమర్శించారు. ఈ విశ్వవిద్యాలయాన్ని అభివృద్ధి చేయాల్సిన అంశంపై ఏపీ అసెంబ్లీలో ప్రస్తావించామని చెప్పారు. తమ ప్రభుత్వం విశ్వవిద్యాలయం అభివృద్ధికి రూ.20 కోట్లు కేటాయించిందని గోరంట్ల బుచ్చయ్య చౌదరి పేర్కొన్నారు.**

## పోక్సో నిందితుడికి

## బాలికల స్కూల్‌లో జాబ్

- 22 మంది విద్యార్థినులను లైంగిక వేధించిన యువకుడు
- మహారాష్ట్రలోని ఠాణె జిల్లా తెంబాలో..
- గతంలోనూ పోక్సో కేసులో జైలుకు వెళ్లొచ్చి..

మహారాష్ట్రలోని ఠాణె జిల్లాలో గల ఒక ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలలో అత్యంత దిగ్భ్రాంతికరమైన ఘటన వెలుగు చూసింది. పాఠశాలలోని 22 మంది విద్యార్థినులపై లైంగిక వేధింపులకు పాల్పడిన ఆరోపణలపై పాఠశాల వంటవాడు గణపత్ గవిల్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. అయితే ఈ కేసులో దర్యాప్తు ముందుకు సాగుతున్న కొద్దీ దిగ్భ్రాంతి కలిగించే నిజాలు బయటపడుతున్నాయి. ముఖ్యంగా ఇతడు గతంలోనే పోక్సో కేసులో జైలుకు వెళ్లి రాగా.. ఇతడికి బాలికల పాఠశాలలో ఉద్యోగం ఎలా ఇచ్చారని స్థానిక ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అలాగే పోలీసులు సైతం దీనిపై ఆరా తీస్తున్నారు.

**భోజనం కోసం వస్తే లైంగిక దాడి**

ఠాణె జిల్లాలోని తెంబా ప్రాంతంలో ఉన్న ఆదివాసి ఆశ్రమ పాఠశాలలో ఈ దారుణం చోటుచేసుకుంది. భోజనం పెట్టే సమయంలో నిందితుడు గణపత్ గవిల్ తమను అసభ్యకరంగా తాకుతూ, గత కొంతకాలంగా వేధింపులకు గురిచేస్తున్నాడని బాధిత విద్యార్థినులు ఆగస్టు 24వ తేదీన పోలీసులకు ఫిర్యాదు చేశారు. చిన్నారి విద్యార్థినుల నుంచి ఫిర్యాదు అందుకున్న వెంటనే స్పందించిన పోలీసులు.. పాఠశాల యాజమాన్యంతో మాట్లాడి ప్రాథమిక ఆధారాలు సేకరించారు. అనంతరం పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి నిందితుడిని కటకటాల్లోకి నెట్టారు.

**గతంలోనూ పోక్సో కేసు.. విధుల్లోకి ఎలా వచ్చాడు?**

ఆపై నిందితుడి గురించి పూర్తి స్థాయిలో ఆరా తీయగా.. విస్తుపోయే విషయాలు వెలుగులోకి వచ్చాయి. ముఖ్యంగా అతడు గతంలోనే పోక్సో కేసులో అరెస్ట్ అయి జైలుకు వెళ్లినట్లు గుర్తించారు. నిందితుడైన గణపత్ గవిల్ గతంలో.. వేరే ఆశ్రమ పాఠశాలలో పనిచేస్తున్న సమయంలో కూడా పలువురు బాలికలపై లైంగిక వేధింపులకు పాల్పడినట్లు తెలుసుకున్నారు. ఆ ఘటనపై నాడు పోక్సో చట్టం కింద కేసు నమోదు కాగా.. అధికారులు అతడిని విధుల నుంచి సస్పెండ్ చేశారు. ఆ కేసులో నిందితుడు కొంతకాలం జైలు శిక్ష కూడా అనుభవించి బయటకు వచ్చాడు.

తీవ్రమైన పోక్సో నేరచరిత్ర ఉండి, జైలుకు వెళ్లొచ్చిన వ్యక్తిని మళ్లీ మరో పాఠశాలలో వంటవాడిగా ఎలా నియమించారనేది ఇప్పుడు పెద్ద ప్రశ్నగా మారింది. అతడిని ఎవరు విధుల్లోకి తీసుకున్నారు, బ్యాక్‌గ్రౌండ్ వెరిఫికేషన్ చేయకుండా నియామకం ఎలా జరిగిందనే కోణంలో అధికారులు దర్యాప్తు వేగవంతం చేశారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపైనా చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు.



# ఘనంగా వికలాంగుల హక్కుల పోరాట సమితి 19వ వార్షికోత్సవం.

**రంగారెడ్డి ఆగస్టు 28 (అనంత జనశక్తి న్యూస్**

వికలాంగుల హక్కుల పోరాట సమితి 19వ వార్షికోత్సవం హయత్ నగర్ లో వికలాంగుల హక్కుల పోరాట స జాతీయ కోర్ కమిటీ వైస్ చైర్మన్ అందే రాంబాబు జెండా ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ వికలాంగుల హక్కుల పోరాట సమితి ఏర్పాటు చేసి నేటి 19 సంవత్సరాలు గడుస్తుందని 2007 లో పద్మశ్రీ మందకృష్ణ మాదిగ నాయకత్వంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో కేవలం 200 రూపాయల నటువంటి వికలాంగుల పెన్షన్ 1500 రూపాయలు చేయాలని అప్పటి రాష్ట్ర ప్రభుత్వం డిమాండ్ చేసి నేడు రెండు తెలుగు రాష్ట్రాలలో తెలంగాణలో 4016రూపాయల పెన్షన్ వృద్ధుల వితంతువులకు 2016రూపాయలు పెన్షన్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వికలాంగులకు 6000 రూపాయలు పెన్షన్ వృద్ధులు వితంతువులకు 4000 పెన్షన్ పూర్తి వైకల్యం కలిగిన వారికి 1500 పెన్షన్ వస్తున్నది అంటే అది మందకృష్ణ మాదిగ ఉద్యమ ఫలితం అని అన్నారు . తెలంగాణ రాష్ట్రంలో 2023లో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ వికలాంగులకు 6000 రూపాయలు పెన్షన్ వృద్ధుల వితంతువులకు 4000 పెన్షన్ ఇస్తానని చెప్పి గత మూడు సంవత్సరాలుగా మోసం చేసింది అని ఈ మోసాన్ని ఎండగడుతూ భవిష్యత్తులో మందకృష్ణ మాదిగ నాయకత్వంలో పూర్తి వైకల్యం కలిగిన వారికి 15,000 పంపించాను ఇచ్చేంతవరకు వీహెచ్పీఎస్ రాష్ట్ర ప్రభుత్వం మీద యుద్ధం ప్రకటిస్తుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వీహెచ్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోవర్ధన్, ఎమ్మార్పీఎస్ ఎల్బీనగర్ నియోజకవర్గం ఇంచార్జ్ కొమ్ము రాజశేఖర్ మాదిగ, ఎల్బీనగర్ నియోజకవర్గ ఏం ఎస్ పి ఇన్చార్జ్ ఎర్ర రవి మాదిగ, భరత్ మాదిగ , చిత్తలూరి వేణు, సతీష్ మాదిగ, కొమరయ్య నాయక్, పాండు యాదవ్, సైదులు యాదవ్ పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# నేత్రదాన ఆవశ్యకతపై అవగాహన.



**పుట్టపర్తి రూరల్ ఆగష్టు 28 అనంత జన శక్తి న్యూస్.**

ప్రతి మనిషి తన మరణానంతరం నేత్రదానం చేసి ఇతరులకు దృష్టి కల్పించాలని శ్రీ సత్య సాయి జిల్లా అందత్వ నివారణ, దృష్టిలోపం నివారణ ప్రోగ్రాం అధికారినీ డాక్టర్ అనురాధ పేర్కొన్నారు. జాతీయ అంధత్వ నివారణ , దృష్టి లోప నివారణ కార్యక్రమం లో భాగంగా ఆగస్టు 25 వ తేదీ నుండి సెప్టెంబరు 8 వ తేదీ వరకు నిర్వహించ బడుచున్న "జాతీయ నేత్ర దాన పక్షోత్సవాలు" సందర్భంగా శ్రీ సత్యసాయి జిల్లా అంధత్వ నివారణ , దృష్టి లోప నివారణ ప్రోగ్రామ్ అధికారిణి డాక్టర్.అనురాధ పుట్టపర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ను సందర్శించారు.ఈ సందర్భంగా ఆసుపత్రికి వచ్చిన రోగులకు , సిబ్బందిని ఉద్దేశించి నేత్ర దానం ఆవశ్యకత గురించి అవగాహన కల్పించారు .ఏ వ్యక్తి అయినా స్త్రీ కాని, పురుషుడు కాని ఏ మతానికి చెందిన వారైనా మరణించిన పిదప నేత్ర దానం చేయవచ్చునని , కళ్ల జోడు పెట్టుకొనే వారు , మధుమేహం, అధిక రక్తపోటు, ఉబ్బసం వ్యాధుల తో బాధపడుతున్న వారు, కంటి శుక్లముల ఆపరేషన్ చేయించుకున్న వారు కూడా నేత్ర దానం చేయవచ్చునని తెలియ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిహెచ్సి వైద్యాధికారులు డా. కె. గాయత్రి, డా. పి. వైష్ణవి , సి. హెచ్.ఓ కె.శివరాం, హెల్త్ సూపర్ వైజర్ లు ఆర్. చంద్రకళ , బి.వి.రమణ, సిబ్బంది,మిత్ర స్వచ్ఛంద సంస్థ విద్యార్థులు రోగులు పాల్గొన్నారు.

# మున్సిపాలిటీల్లో రూ.32 వేల కోట్లతో అభివృద్ధి పనులు



- కొండపల్లి మున్సిపాలిటీకి వివిధ పథకాల కింద రూ.96 కోట్లు
- రెండేళ్లలో అభివృద్ధి పనులన్నీ పూర్తి చేసేలా చర్యలు
- మీడియా తో మంత్రి పొంగూరు నారాయణ

**కొండపల్లి ఆగస్టు 28, అనంత జనశక్తి న్యూస్**

రాష్ట్రవ్యాప్తంగా మున్సిపాలిటీల్లో రూ.32 వేల కోట్లతో అభివృద్ధి పనులు చేపడుతున్నామని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో పట్టణాల్లో కనీస మౌలిక వసతులను పూర్తిస్థాయిలో కల్పిస్తున్నామని చెప్పారు.కొండపల్లి మున్సిపాలిటీ పరిధిలో శుక్రవారం మంత్రి పొంగూరు నారాయణ పర్యటించారు. స్థానిక ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్తో కలిసి డంపింగ్ యార్డ్ను పరిశీలించారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడారు.గత ప్రభుత్వం చేసిన అవకతవకల కారణంగా రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దారుణంగా మారిందని మంత్రి నారాయణ అన్నారు. అయినప్పటికీ అభివృద్ధి కార్యక్రమాలకు ఎలాంటి ఆటంకం కలగకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.కొండపల్లి మున్సిపాలిటీకి వివిధ పథకాల కింద రూ.96 కోట్లు కేటాయించామని మంత్రి వెల్లడించారు. జనాభా ప్రాతిపదికన మున్సిపాలిటీలకు నిధులు కేటాయిస్తున్నామని తెలిపారు.స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత మున్సిపాలిటీల్లో వేల కోట్ల రూపాయలతో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేపట్టడం ఇదే తొలిసారి అని మంత్రి నారాయణ పేర్కొన్నారు. మున్సిపాలిటీలకు నిధులు కేటాయించినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.రాబోయే రెండేళ్లలో అభివృద్ధి పనులన్నింటినీ పూర్తి చేసేలా ముందుకెళ్తున్నామని మంత్రి నారాయణ తెలిపారు.





# కలెక్టరేట్‌లో ఘనంగా రక్షాబంధన్ వేడుకలు

- బాలికల రక్షణ, విద్య, సాధికారతకు ప్రతి ఒక్కరూ అండగా నిలవాలి : కలెక్టర్ అంకిత్

**భద్రాద్రి కొత్తగూడెంబ్యూరో , ఆగస్టు 28, అనంత జనశక్తి న్యూస్:**

రక్షాబంధన్ పర్వదినాన్ని పురస్కరించుకొని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టరేట్ లో శుక్రవారం రక్షాబంధన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. చిల్డ్రన్ హోమ్‌కు చెందిన బాలికలు జిల్లా కలెక్టర్ అంకిత్‌తో పాటు అదనపు కలెక్టర్లు (రెవెన్యూ), (లోకల్ బాడీస్), జిల్లా సంక్షేమాధికారి, ఇతర అధికారులకు రాఖీలు కట్టి రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అధికారులు బాలికలతో ఆప్యాయంగా ముచ్చటించి వారి విద్య, భవిష్యత్తు లక్ష్యాలు, అభిరుచులను తెలుసుకున్నారు. బాలికలకు మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేయడంతో పాటు పుస్తకాలు, పెన్నులు, స్వీట్లు తదితర బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ బాలికలు కుటుంబానికే కాకుండా సమాజానికి, దేశానికి విలువైన సంపద అని అన్నారు. ప్రతి బాలికకు సురక్షితమైన వాతావరణం కల్పించడంతో పాటు నాణ్యమైన విద్య అందించి, వారు తమ కలలను సాకారం చేసుకునేలా ప్రోత్సహించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. 'బేటీ బచావో-బేటీ పడావో' స్ఫూర్తితో బాలికల రక్షణ, విద్య, ఆరోగ్యం, సాధికారతకు ప్రభుత్వం అనేక కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు. బాలికలు ధైర్యంగా ముందుకు సాగి ఉన్నత విద్యను అభ్యసించి, తమకు నచ్చిన రంగంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. 'బాలికను కాపాడుదాం.. బాలికను చదివిద్దాం.. బాలిక ఎదుగుదలకు తోడ్పడదాం' అనే సందేశంతో ప్రతి ఒక్కరూ బాలికల భద్రత, విద్య, భవిష్యత్తు కోసం బాధ్యతగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో హబ్ మిషన్ కోఆర్డినేటర్ సంతోష రూప, స్వాతి, ప్రియాంక, మౌనిక, దీప్తి, చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ వినోద్, చిల్డ్రన్ హోమ్ బాలికలు పాల్గొన్నారు.

# ఫ్యూచర్ సిటీలో మహేశ్వరానికే పెద్దపీట వేయాలి

- ఓఆర్ఆర్ ఆర్ఆర్ఆర్, ఎయిర్ పోర్ట్ తో మహేశ్వరం గోల్డెన్ హబ్
- తీర్మానాలు చేయని సర్పంచులపై జేఏసీ ఫైర్
- ఫ్యూచర్ సిటీలో గ్రామ పంచాయతీల విలీనం చేయడానికి అందరూ ఒకే బిఆర్ఎస్ ఎందుకు అడ్డు
- మహేశ్వరం లేకుండా ఫ్యూచర్ సిటీయే లేదు విలీనం చేయాల్సిందే!
- అన్నిగ్రామాలను కలపాలని జేఏసీ అల్టిమేటం
- 31, సెప్టెం 1న రిలే నిరాహార దీక్షలు
- మహేశ్వరం జర్నలిస్టులు అందరూ జేఏసీలో భాగస్వామ్యం కావాలి



**మహేశ్వరం, ఆగస్టు 28, (అనంత జనశక్తి )**

భారత్ ఫ్యూచర్ సిటీలో మహేశ్వరం ప్రాంతాన్ని పూర్తి స్థాయిలో విలీనం చేయాలని డిమాండ్ చేస్తూ ఫ్యూచర్ సిటీ జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ ) సంచలన ప్రకటన చేసింది. విలీనానికి నోచుకోని గ్రామాలను వెంటనే కలపాలని, లేకుంటే పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించింది.శుక్రవారం మహేశ్వరంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో జేఏసీ నేతలు ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు.

**ఫ్యూచర్ సిటీలో మహేశ్వరానికే పెద్దపీట వేయాలి**

ఫ్యూచర్ సిటీలో మహేశ్వరానికే పెద్దపీట వేయాలని జేఏసీ చైర్మన్ వత్తుల రఘుపతి అన్నారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా 30 వేల ఎకరాల్లో నిర్మించనున్న భారత్ ఫ్యూచర్ సిటీ మహేశ్వరం గడ్డపైనే ఆధారపడి ఉందన్నారు. ఐటీ, ఏఐ, డేటా సెంటర్లు, లైఫ్ సైన్సెస్, విద్య, వైద్య రంగాల్లో లక్షల కోట్ల పెట్టుబడులు రానున్నాయని, ఇప్పటికే అమెజాన్ వెబ్ సర్వీసెస్ డేటా సెంటర్ శంకుస్థాపనతోనే ఈ ప్రాంతం బ్రాండ్ అయిందని తెలిపారు. ఫ్యూచర్ సిటీ వస్తే స్థానిక యువతకు ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలాది ఉద్యోగాలు వస్తాయన్నారు.

**ఓఆర్ఆర్, ఆర్ఆర్ఆర్ , ఎయిర్ పోర్ట్ తో మహేశ్వరం గోల్డెన్ హబ్**

ఔటర్ రింగ్ రోడ్డు, రీజినల్ రింగ్ రోడ్డు, శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి అనుసంధాన రహదారులు, రానున్న బుల్లెట్ ట్రైన్, మెట్రో, రతన్ టాటా 300 ఫీట్ రేడియల్ రోడ్లు, మల్టీమోడల్ రవాణా వ్యవస్థతో మహేశ్వరం రాష్ట్రానికే రవాణా కేంద్రంగా మారబోతోందని పేర్కొన్నారు. దీంతో రియల్ ఎస్టేట్, నిర్మాణం, హోటళ్లు, చిన్న వ్యాపారాలు, సేవా రంగాలు అమాంతం పెరుగుతాయని అన్నారు.

**తీర్మానాలు చేయని సర్పంచులపై జేఏసీ ఫైర్**

మహేశ్వరం, కందుకూరు మండలాల్లోని కొన్ని గ్రామాలు ఇప్పటికే ఫ్యూచర్ సిటీలో విలీనమయ్యాయని, మిగిలిన గ్రామాల సర్పంచులు కూడా వెంటనే ఏకగ్రీవ తీర్మానాలు చేసి ఎంపీడీవోకు, జేఏసీ కి అందజేయాలని జేఏసీ డిమాండ్ చేసింది. ఈ విషయంపై రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు, రంగారెడ్డి జిల్లా ఇంఛార్జ్, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుకు పలుమార్లు వినతిపత్రాలు ఇచ్చామని గుర్తుచేశారు. జేఏసీ అధ్యక్షుడు కర్నాటి మనోహర్ మాట్లాడుతూ ఇది ఒక్క తరం ప్రయోజనం కాదు, భవిష్యత్ తరాలకు మెరుగైన నగరాన్ని అందించే గొప్ప అవకాశమని, ప్రతి గ్రామ పంచాయతీ ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

**31, సెప్టెం 1న రిలే నిరాహార దీక్షలు**

ఫ్యూచర్ సిటీ విలీనం కోసం తీర్మానం చేయని గ్రామాల సర్పంచుల తీరుకు నిరసనగా ఈ నెల 31వ తేదీ మరియు సెప్టెంబర్ 1వ తేదీన మహేశ్వరంలోని ప్రభుత్వ కార్యాలయాల ముందు రిలే నిరాహార దీక్షలు చేపడతామని జేఏసీ నేతలు తేల్చి చెప్పారు.ఈ సమావేశంలో మహేశ్వరం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వట్టేలా మల్లేష్ యాదవ్, రాష్ట్ర బీజేపీ నాయకుడు కడారి జంగయ్య, సీపీఐ నాయకుడు దత్తునాయక్, బీజేపీ మాజీ ఎంపీటీసీ పోతర్ల సుదర్శన్ యాదవ్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కాకీశ్వర్ ముదిరాజ్ , ఎమ్మార్పీఎస్ మాజీ మండల అధ్యక్షుడు ఎర్ర గణేష్, జేఏసీ సలహాదారులు కె. జగన్ రెడ్డి, గోటికె రవీందర్ రెడ్డి, నర్సింహా యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# పోలీస్ అన్నకు రాఖీ కట్టిన చిన్నారి అక్షిత!

- రక్షణకు ప్రతీకగా రాఖీ.. ఆత్మీయతతో పోలీస్‌స్టేషన్‌కు చేరిన చిన్నారి
- ఇన్‌స్పెక్టర్ శంకరయ్య కు రాఖీ కట్టి స్వీట్ తినిపించిన అక్షిత
- సోదరభావం, ప్రేమానురాగాలకు రాఖీ పౌర్ణమి ప్రతీక: ఇన్‌స్పెక్టర్ శంకరయ్య




**అబ్దుల్లాపూర్‌మెట్, ఆగస్టు 28**
**అనంత జనశక్తి న్యూస్**

రాఖీ పౌర్ణమి పర్వదినం సందర్భంగా ఓ చిన్నారి పోలీస్ అధికారులను సోదరులుగా భావించి రాఖీ కట్టి ఆత్మీయతను చాటుకుంది. హయత్‌నగర్‌లో నివసిస్తూ ఏడో తరగతి చదువుతున్న దార్ల అక్షిత తన సోదరుడు హర్షవర్ధన్‌తో కలిసి శుక్రవారం హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లింది. అక్కడ ఇన్‌స్పెక్టర్ సీహెచ్.శంకరయ్యను కలిసి ఆయనకు రాఖీ కట్టి, స్వీట్ తినిపించింది. అనంతరం ఆయన ఆశీర్వాదం తీసుకుంది.

**పోలీసులపై చిన్నారి ఆప్యాయత**

రాఖీ కట్టేందుకు పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన చిన్నారి అక్షితను ఇన్‌స్పెక్టర్ శంకరయ్య ఆప్యాయంగా పలకరించారు. రాఖీ కట్టిన అనంతరం చిన్నారిని ఆశీర్వదించి అభినందించారు. అనంతరం పోలీస్‌స్టేషన్ అడ్మిన్ ఎస్ఐ నరసింహకు కూడా అక్షిత రాఖీ కట్టి స్వీట్ తినిపించింది. చిన్నారి చూపిన ఆత్మీయతతో పోలీస్ అధికారులు, సిబ్బంది సంతోషం వ్యక్తం చేశారు.

సోదరభావానికి ప్రతీక రాఖీ పౌర్ణమి

రాఖీ పౌర్ణమి సోదర-సోదరీమణుల మధ్య ప్రేమ, అనురాగం, నమ్మకం, రక్షణకు ప్రతీకగా నిలుస్తుందని ఇన్‌స్పెక్టర్ శంకరయ్య అన్నారు. రాఖీ కేవలం ఒక దారం కాదని.. ఆప్యాయత, బాధ్యత, రక్షణకు ప్రతీక అని పేర్కొన్నారు. కుటుంబ సభ్యులతో పాటు సమాజంలోని ప్రతి ఒక్కరి పట్ల ప్రేమాభిమానాలు, మానవతా దృక్పథంతో మెలగడమే పండుగల అసలు ఉద్దేశమన్నారు.చిన్నారులు మన సంస్కృతి, సంప్రదాయాలను తెలుసుకుని పండుగలను ఆనందంగా జరుపుకోవడం అభినందనీయమని అన్నారు. అక్షిత వంటి చిన్నారుల్లో ఉన్న ఆప్యాయత, పెద్దల పట్ల గౌరవం ఇతరులకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.ఈ సందర్భంగా అక్షిత, హర్షవర్ధన్‌లకు ఇన్‌స్పెక్టర్ శంకరయ్య రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు.

**పోలీస్‌స్టేషన్‌లో పండుగ సందడి**

రాఖీ పండుగ సందర్భంగా చిన్నారి అక్షిత పోలీస్‌స్టేషన్‌కు వచ్చి అధికారులకు రాఖీ కట్టడంతో అక్కడ ఆత్మీయ వాతావరణం నెలకొంది. సోదరభావాన్ని చాటే రాఖీ పౌర్ణమి వేడుకలను చిన్నారులు ఆనందంగా జరుపుకోవడం పలువురిని ఆకట్టుకుంది.

## 150 లక్షల టన్నుల లెగసీ వేస్ట్‌ను
# పూర్తిగా తొలగిస్తున్నాం

- అక్టోబర్ 2 నాటికి భూమిలోపల ఉన్న చెత్తను కూడా పూర్తిగా తొలగించాలి
- 6 వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్ల ద్వారా ఏ రోజు చెత్త అదే రోజు విద్యుత్‌గా మారుస్తాం
- లెగసీ వేస్ట్ తొలగింపు, ఫ్రెష్ వేస్ట్ ప్లాంట్ల ఏర్పాటుపై మంత్రి నారాయణ సమీక్ష

**అమరావతి ఆగస్టు 28, అనంత జనశక్తి న్యూస్**

లెగసీ వేస్ట్ తొలగింపు, ఫ్రెష్ వేస్ట్ ప్లాంట్ల ఏర్పాటు పనులపై రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశానికి స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ఎండీ సునీల్ కుమార్ రెడ్డి, కాంట్రాక్ట్ సంస్థల ప్రతినిధులు హాజరయ్యారు.గత ప్రభుత్వం వదిలి వెళ్లిన 150 లక్షల టన్నుల లెగసీ వేస్ట్‌ను పూర్తిగా తొలగిస్తున్నామని మంత్రి నారాయణ తెలిపారు. భూమిపైన ఉన్న వేస్ట్‌ను ఇప్పటికే పూర్తిగా తొలగించామని చెప్పారు. భూమి లోపల ఉన్న చెత్తను కూడా అక్టోబర్ 2వ తేదీ నాటికి పూర్తిగా తొలగించాలని అధికారులను ఆదేశించారు.కొత్తగా ఏర్పాటు చేస్తున్న 6 వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్ల ద్వారా ఏ రోజు చెత్త అదే రోజు పూర్తిగా విద్యుత్‌గా మారుస్తామని మంత్రి తెలిపారు. ఈలోగా ఉత్పత్తి అయ్యే ఘన వ్యర్థాల నిర్వహణ కోసం ఫ్రెష్ వేస్ట్ ప్లాంట్లను నెలకొల్పుతున్నామని చెప్పారు.ఫ్రెష్ వేస్ట్ ప్లాంట్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని మంత్రి నారాయణ ఆదేశించారు. అక్టోబర్ 2 నుంచి మొత్తం చెత్త అంతా ప్లాంట్లకు తరలించాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలో చెత్త సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని మంత్రి తెలిపారు. డంపింగ్ యార్డ్ రహిత మున్సిపాలిటీలుగా ఏపీని మారుస్తామని మంత్రి నారాయణ స్పష్టం చేశారు.



అనంత జనశక్తి
జనం కోసమే మా అక్షరం




# మలబద్ధకంతో విసిగిపోయారా, ఇప్పుడు చెప్పేవి తీసుకుంటే కడుపు మొత్తం ఖాళీ అవ్వాల్సిందే

సరైన ఆహారం తీసుకోకపోవడం, ఒత్తిడి పెరగడం, పోషకాహారం తీసుకోకపోవడం, నిద్ర లేమి, నీరు ఎక్కువగా తాగకపోవడం ఇలాంటి ఎన్నో కారణాల వల్ల చాలా మందికి మలబద్ధకం సమస్య ఉంటుంది. దీనిని నేచురల్‌గా దూరం చేసుకునేందుకు కొన్ని ఇంటి చిట్కాలు హెల్ప్ చేస్తాయని చాలా మంది జీరా వాటర్, గోరువెచ్చని నీరు తాగుతారు. అయితే, దాని బదులు, మరికొన్ని మంచి టిప్స్ ఉన్నాయని వీటిని ఫాలో అయితే ఎలాంటి మెడిసిన్ వాడకుండానే కాన్స్టిపేషన్ తగ్గుతుందని న్యూట్రిషనిస్ట్ శ్వేతా షా చెబుతున్నారు. అలాంటి టిప్స్ ఏంటో తెలుసుకోండి.









**జీరా వాటర్ బదులు**

చాలా బదులు జీర్ణ సమస్యలు రాగానే జీరా వాటర్, వేడి నీరు తాగడం చేస్తుంటారు. అలా కాకుండా ఈ సారి కొద్దిగా గోరువెచ్చని నీటిలో నెయ్యిని కలిపి తాగి చూడండి. దీంతో మలం మృదువుగా మారుతుంది. దీంతో మలవిసర్జన సాఫీగా జరుగుతుంది. నెయ్యి నేచురల్ లాక్సేటీవ్‌గా పనిచేస్తుంది. దీనిని తీసుకోవడం వల్ల మలం మొత్తం మృదువుగా మారి మల విసర్జన సరిగా జరుగుతుంది. దీంతో బవెల్ మూమెంట్స్ సరిగా ఉంటాయి. దీనికోసం ఓ కప్పు గోరువెచ్చని నీరు లేదా పాలలో 1 టీస్పూన్ నెయ్యి వేసి కలిపి పరగడపున తాగండి. దీని వల్ల చాలా వరకూ మలబద్ధకం దూరమవుతుంది.

**ఇసబ్‌గోల్ బదులు ప్రూన్స్**

చాలా మంది ఇసబ్‌గోల్‌ని మలబద్ధకాన్ని తగ్గించేందుకు వాడతారు. అయితే, ఇది అందరికీ అందుబాటులో ఉండదు. ఉన్నా కూడా దీనికంటే మెరుగైనది తీసుకోవాలనుకుంటే ప్రూన్స్ పండ్లు తీసుకోండి. ఇవి కూడా నేచురల్ లాక్సేటీవ్ గుణాలని కలిగి ఉండి గట్ హెల్త్‌ని సరిగ్గా చేస్తాయి. ప్రూన్స్ పండ్లలో హై ఫైబర్, నేచురల్ షుగర్ ఆల్కహాల్ గుణమైన సార్బిటోల్ ఉంటుంది. దీని వల్ల స్టూల్ సాఫ్ట్ అవుతుంది. బవెల్ మూమెంట్స్ పెరుగుతాయి. రోజుకి 5 నుంచి 8 ప్రూన్స్ పండ్లు తింట నీరు ఎక్కువగా తాగండి. ఆటోమేటిగ్గా కాన్స్టిపేషన్ తగ్గుతుంది.

**బొప్పాయి**

మలబద్ధకాన్ని దూరం చేయడంలో బొప్పాయి చాలా బాగా పనిచేస్తుంది. దీనిని తినడం వల్ల బవెల్ మూమెంట్స్ పెరుగుతాయి. బొప్పాయి తినడం వల్ల మలబద్ధకం చాలా వరకూ తగ్గుతుంది. ఇందులోని ఫైబర్, నీటిశాతం పపైన్ అనే ఎంజైమ్ మలబద్ధకాన్ని దూరం చేస్తుంది. ఇందులోని సోల్యూబుల్ ఫైబర్ స్టూల్‌ని బయటికెళ్లేలా చేస్తుంది. పపైన్ ప్రోటీన్స్‌ని బ్రేక్ చేస్తుంది. జీర్ణ వ్యవస్థని ఈజీ చేస్తుంది. దీంతో బవెల్ మూమెంట్స్ పెరుగుతాయి. అందుకోసం బాగా పండిన బొప్పాయి పండుని తీసుకోవడం మంచిది.

**పాల బదులు ఆముదం నీరు**

పాలు అందరికీ పడకపోవచ్చు. కొంతమందికి దీని వల్ల జీర్ణం లేట్‌గా అవుతుంది. అలా కాకుండా గోరువెచ్చని నీటిలో హాఫ్ టీస్పూన్ ఆముదాన్ని కలిపి నిద్రపోయేముందు తాగండి. దీంతో కొలన్ క్లెన్స్ అవుతుంది. గోరువెచ్చని నీటిలో మనం ఆముదం కలిపి తాగడం వల్ల చాలా వరకూ మలబద్ధకం తగ్గుతుంది. ఇందులోని లాక్సేటీవ్ గుణాలు మలబద్ధకాన్ని తగ్గిస్తాయి. ఆముదాన్ని తీసుకోవడం వల్ల మజిల్స్ స్టిమ్యులేట్ అవుతాయి. కడుపు మొత్తం క్లీన్ అవుతుంది. మలబద్ధకం తగ్గుతుంది.

**వీటితో పాటు**

ఎక్కువగా ఫైబర్ ఫుడ్స్ తీసుకోవాలి. కూరగాయలు, పండ్లు, చిక్కుళ్లు, నట్స్, హోల్ గ్రెయిన్స్, ఓట్స్, బ్రౌన్ రైస్ వంటివి తీసుకోవాలి.

ఎక్కువగా నీరు తాగాలి. రోజుకి కనీసం 8 నుంచి 10 కప్పుల వరకూ తీసుకోవాలి.

ప్రోబయోటిక్స్ అయిన పెరుగు, కెఫిర్ వంటివి తీసుకుంటే జీర్ణ వ్యవస్థ మెరుగ్గా మారుతుంది.

ఒమేగా 3 రిచ్ ఫుడ్స్ తీసుకోవాలి. చేపలు, అవకాడో, అవిసెలు తీసుకోవాలి.

అంతేకాకుండా, రెగ్యులర్‌గా వర్కౌట్ చేయాలి.


# ఆముదం, రోజ్మెరీ ఆయిల్ రెండింటిలో ఏది బెటర్, జుట్టు పెరగడానికి ఆముదం బాగా పనిచేస్తుందా,





ఆముదం, రోజ్మెరీ ఆయిల్ రెండు కూడా ముందుగా సహజమైన ఆయిల్స్. ఈ పవర్‌ఫుల్ ఆయిల్స్ రాయడం వల్ల జుట్టు కుదుళ్ళు బలంగా మారతాయి. అంతేకాకుండా, జుట్టుకి పోషణ అందుతుంది. జుట్టు రాలిపోకుండా ఉండడానికి హెల్ప్ చేస్తుంది. ఇందులో ఒక్కో నూనెలో ఒక్కో పోషకం ఉంటుంది. ఇవి జుట్టుకి సంబంధించిన సమస్యల్ని దూరం చేస్తాయి. జుట్టు చిట్లడం, డ్రై హెయిర్ వంటి సమస్యలుంటే మీరు కొబ్బరినూనె మాత్రమే కాకుండా కొబ్బరినూనెలో కొద్దిగా రోజ్మెరీ, ఆముదం కలిపి రాసి చూడండి. మీకే తేడా తెలుస్తుంది. విడివిడిగా దేనికది ప్రత్యేకమే.. అయితే జుట్టుని కాపాడడంలో ఏది బెటర్ అంటే కొన్ని విషయాలని గమనించాలి.







**ఆముదం**

ఆముదంలో రిసినోలిక్ యాసిడ్ ఉంటుంది. ఇది యాంటీ మైక్రోబయల్, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు, స్కాల్ప్‌ని హెల్దీగా మార్చి బలమైన జుట్టుని అందిస్తాయి. ఆముదం జుట్టుకి హెల్ప్ చేస్తుంది. ఇందులో జుట్టు పెరుగుదలకి హెల్ప్ చేసే ఫ్యాటీ యాసిడ్స్, విటమిన్ ఈ, ఖనిజాలు ఉంటాయి. జుట్టుకుదుళ్ళలోకి లోతుగా చొచ్చుకుపోతుంది. జుట్టుకి లోపలి నుండి పోషణని అందిస్తుంది. దీనిని రాస్తే జుట్టు పెరుగుతుంది. జుట్టు రాలకుండా ఒత్తుగా పెరుగుతుంది. దీంతో జుట్టు మెరుస్తుంది. రెగ్యులర్‌గా వాడే కొబ్బరినూనెతో కలిపి రాయడం వల్ల హెల్దీ, బలమైన జుట్టు మీ సొంతమవుతుంది.

**రోజ్మెరీ ఆయిల్**

రోజ్మెరీ ఆయిల్ రక్తప్రసరణని ప్రేరేపించి, ఇన్‌ఫ్లమేషన్‌ని తగ్గిస్తుంది. దీంతో పాటు జుట్టు రాలడానికి కారణమయ్యే హార్మోన్ DHT ని కంట్రోల్ చేస్తుంది. రోజ్మెరీ ఎసెన్షియల్ ఆయిల్‌ని రోజ్మెరీతో తయారుచేస్తారు. దీనిని శతాబ్ధాలుగా వాడుతుంటారు. దీనిని వాడడం వల్ల జుట్టు పెరుగుదలకి అవసరమైన పోషకాలు పుష్కలంగా అందుతాయి. దీనిలో కాల్షియం, విటమిన్ బి, ఐరన్‌లు ఉంటాయి. ఇది తలపై చర్మాన్ని క్లీన్‌గా మార్చడమే కాకుండా రక్తప్రసరణని పెంచుతుంది. జుట్టు కుదుళ్ళని ఉత్తేజపరిచి జుట్టుని మెరిసేలా చేస్తుంది.

**వాటిని కలిపితే**

ఆముదం, రోజ్‌మెరీ కలిపి మసాజ్ చేసినప్పుడు సున్నితంగా మసాజ్ చేయండి. కొన్ని గంటల పాటు చేస్తే రక్తప్రసరణ పెరుగుతుంది. జుట్టు పెరుగుదలకి హెల్ప్ అవుతుంది. వారానికి, 2, 3సార్లు చేస్తే మంచి రిజల్ట్ ఉంటుంది. కాబట్టి, ఈ మధ్యకాలంలో ఎక్కువగా రోజ్మెరీ ఆయిల్ పాపులర్ అవుతుంది.

కొబ్బరినూనెలో కలపడానికి ఏది మంచిది

మీరు కొబ్బరినూనెతో రోజ్‌మెరీ, లేదా ఆముదాన్ని కలపాలనుకుంటే మీ అవసరాలను బట్టి వాడండి. జుట్టు పెరగాలనుకుంటే ఆముదాన్ని సెలక్ట్ చేసుకోండి. దీని వల్ల కొత్త జుట్టు పెరుగుతుంది. స్కాల్ప్ మెల్త్ మెరుగవుతుంది. ఉన్న జుట్టు ఆరోగ్యంగా ఉండాలనుకుంటే రోజ్‌మెరీ ఆయిల్‌ని కలపండి.

**బెస్ట్ రిజల్ట్స్ కోసం**

మీరు వారానికి 1 నుంచి 2 సార్లు జుట్టుకి ఆముదాన్ని రాయండి. రెగ్యులర్‌గా రాస్తే జుట్టు జిడ్డుగా మారడమే కాకుండా చర్మ రంధ్రాలు మూసుకుపోతాయి. కాబట్టి, మితంగా వాడండి. నూనెని కొద్దిగా వేడి చేసి 15 నిమిషాల తలపై మసాజ్ చేసి మైల్డ్ షాంపూతో క్లీన్ చేయండి. వారంలో రెగ్యులర్‌గా వాడితే జుట్టు కుదుళ్ళు ఉత్తేజితమవుతాయి. రక్తప్రసరణ మెరుగై, జుట్టు బలంగా మారుతుంది. దీంతో జుట్టు మందంగా కూడా మారుతుంది.



## లోన్ తీసుకుని ప్రోగ్రామ్స్ చేశా.. ఆ బాధ నాకు తెలుసు



'మ్యాడ్'తో తెలుగు తెరపై మెరిసి.. ఆ తర్వాత '8 వసంతాలు' అంటూ కుర్రకారు హృదయాలను కొల్లగొట్టేశారు అనంతిక సనీల్ కుమార్. ఇప్పుడు 'రోమాంచకం'తో పలకరించేందుకు సిద్ధమయ్యారు. ఈ సినిమా సెప్టెంబర్ 3న ప్రేక్షకుల ముందుకు రానుంది. దీని ప్రచారంలో భాగంగా ఇచ్చిన ఇంటర్వ్యూలో అనంతిక తన కుటుంబం, కెరీర్‌కు సంబంధించిన కీలక విషయాలు పంచుకున్నారు.

**అందుకే ఇండస్ట్రీకి వచ్చా..**

"చిన్నప్పటి నుంచి నాకు కళలు అంటే ఇష్టం. నాట్యం నేర్చుకుంటున్నాను. ఆరో తరగతిలో ఉన్నప్పటి నుంచి ప్రోగ్రామ్స్ ఇవ్వడం మొదలుపెట్టా. ఒక ప్రోగ్రాం ఇవ్వాలంటే చాలా ఖర్చు అవుతుంది. ఇంట్లో ఆర్థిక ఇబ్బందులు ఉండేవి. అయినా వాళ్లు ఎప్పుడూ నన్ను ఆపలేదు. లోన్ తీసుకుని మరీ నన్ను కార్యక్రమాలకు పంపేవారు. ఆర్థిక ఇబ్బందులు ఎలా ఉంటాయో నేను దగ్గర నుంచి చూశాను. ఆ బాధ నాకు తెలుసు. అమ్మానాన్న నన్ను అంత కష్టపడి పెంచారు. వాళ్లకు కూడా నేన ఏదోఒకటి చేయాలి అనే ఇండస్ట్రీకి వచ్చాను" అని చెప్పారు.

**పెద్ద ప్రాజెక్ట్‌లు మిస్ అయ్యా..**

తన కెరీర్‌లో చాలా పెద్ద ప్రాజెక్ట్‌లు మిస్ అయినట్లు అనంతిక చెప్పారు. "ఫొటో పంపమంటారు. చిన్నపిల్లలా ఉన్నానని రిజెక్ట్ చేసేవారు. లుక్స్ కారణంగా నాని 'ది ప్యారడైజ్' అవకాశం పోయింది . మిస్ అయినందుకు బాధ ఉన్నా.. ఏం జరిగినా ముందుకు సాగాలనే మనస్తత్వం నాది. నాని అంటే నాకు చాలా ఇష్టం. 'రోమాంచకం' హిట్ అవుతుందని నాకు నమ్మకం ఉంది. మనకు రాసి ఉన్నది ఎప్పటికైనా మనకు వస్తుందని నమ్ముతాను" అని అనంతిక పంచుకున్నారు.

## విభిన్న కోణాలున్న పాత్ర శూర్పణఖ!



రామాయణ స్క్రిప్ట్ తనకు శూర్పణఖలోని కొత్త కోణాలను అన్వేషించడంలో సహాయపడిందని అంటోంది కథానాయిక రకుల్ ప్రీత్ సింగ్. ఇప్పుడామె నితేశ్ తివారీ దర్శకత్వంలో రూపొందుతున్న 'రామాయణ: పార్ట్ 1' చిత్రంలో నటిస్తున్న సంగతి తెలిసిందే. ఇందులో ఆమె రావణుడి సోదరి అయిన శూర్పణఖ పాత్రలో కనిపించనుంది. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న రకుల్ ఈ సినిమాలోని తన పాత్ర గురించి కొన్ని ఆసక్తికర విషయాల్ని పంచుకుంది.

"శూర్పణఖ జీవితంలోని ఇంతకుముందు తెలియని కొన్ని కోణాలు ఈ పాత్ర చేయటం ద్వారా తెలుసుకున్నాను. ఆమె గురించి నాకు తెలియని విషయాలు చాలా ఉన్నాయి. నేను ఈ స్క్రిప్ట్ చదివినప్పుడు, లక్ష్మణుడు ఆమె ముక్కును కోసిన సంఘటన కంటే ముందు, ఆ తర్వాత ఆమె జీవితం గురించి చాలా విషయాలు అందులో ఉన్నాయి. నేను ఈ పాత్ర చేయడం ద్వారా నాకు ఇవన్నీ ఆసక్తిగా అనిపించాయి. అందుకే నాకు ఈ పాత్ర చాలా బాగా నచ్చింది. శూర్పణఖ వ్యక్తిత్వంలోని విభిన్న కోణాలకు నేను ఆకర్షితురాలినయ్యాను. లంకలో ఆమెను అత్యంత అందమైన మహిళ అని అనేవారు. ఆమెకు అహం ఉండేది. చరిత్ర తరచుగా ఆమెను ఒక భయంకరమైన ప్రతినాయకురాలిగా మాత్రమే గుర్తుంచుకున్నప్పటికీ శూర్పణఖలోని సహజసిద్ధమైన సంక్లిష్టతే నేను ఈ పాత్రను పోషించేలా చేసింద"ంటూ చెప్పుకొచ్చింది.

## దుల్కర్, నివిన్ మరోసారి మల్టీస్టారర్



కుటుంబ నేపథ్యం, ప్రేమకథా చిత్రాలతో సినీప్రియుల్ని అలరిస్తుంటారు మలయాళ కథానాయకుడు నివిన్ పాలీ. గతంలో 'సర్వం మాయ' చిత్రంలో సంప్రదాయ బ్రాహ్మణ కుటుంబానికి చెందిన యువకుడి పాత్రలో నటించి ప్రేక్షకుల హృదయాల్ని గెలుచుకున్నారు. ప్రస్తుతం ఇటీవలే విడుదలైన 'బెత్లెహం కుడుంబ యూనిట్' చిత్రంలో మమితా బైజుతో కలిసి ప్రేమప్రయాణం కొనసాగిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే హీరో నివిన్ తదుపరి చిత్రం దుల్కర్ సల్మాన్‌తో కలిసి చేయనున్నట్లు ఓ ఇంటర్వ్యూలో అధికారికంగా వెల్లడించారు. "దుల్కర్, నేను కలిసి పనిచేయడానికి ఆసక్తిగా ఉన్నాం. మా ఇద్దరికీ నచ్చే ఒక స్క్రిప్ట్, దాన్ని సుముఖంగా తీర్చిదిద్దే ఒక దర్శకుడు కావాలి. ఆగస్టు 21న 'బెత్లెహం కుడుంబ యూనిట్' చిత్రం విడుదలైన తర్వాత దుల్కర్ నన్ను అభినందించార"ని తెలిపారు. దుల్కర్, నివిన్ కాంబినేషన్‌లో 'విక్రమాదిత్యన్', 'బెంగళూర్ డేస్' చిత్రాలొచ్చాయి. మరోసారి వీరిద్దరి కలిసి ప్రేక్షకుల్ని ఎలా మెప్పించనున్నారో తెలియాలంటే కొన్ని రోజులు వేచి చూడాల్సిందే.

## ఫోర్బ్స్ కవర్ పేజీపై అల్లు అర్జున్



ప్రముఖ కథానాయకుడు అల్లు అర్జున్ అరుదైన ఘనతను సొంతం చేసుకున్నారు. ప్రతిష్ఠాత్మకమైన ఫోర్బ్స్ ఇండియా మ్యాగజైన్ 'షో స్టాపర్స్ - 2026' పేరుతో విడుదల చేసిన సంచిక ముఖచిత్రంపై అల్లు అర్జున్ మెరిశారు. భారతదేశంలో అత్యంత ప్రభావం చూపుతున్న వంద మంది ప్రముఖులు, వాళ్లకున్న ఆదరణ, బ్రాండ్ విలువ, ఇతర విశేషాలతో ఈ మ్యాగజైన్‌ని తీసుకొచ్చింది ఫోర్బ్స్ ఇండియా. 'పుష్ప' సినిమాలతో పాన్ ఇండియా స్థాయిలో సత్తాని చాటిన అల్లు అర్జున్ వివిధ రంగాలకు చెందిన వంద మంది ప్రముఖుల్లో అగ్ర స్థానంలో నిలుస్తూ షో స్టాపర్స్ - 2026 కవర్ పేజీపై మెరిశారు. ఏటా ఇలా ప్రభావం చూపుతున్న వంద మంది ప్రముఖుల్ని ఒక వేదికపైకి తీసుకొస్తోంది ఫోర్బ్స్ ఇండియా సంస్థ.

## అదే కొలంబో టెస్టులో కోహ్లీ ఉండుంటే.. ఫలితం మరోలా..:



ఒక్క రోజులో నాలుగు వికెట్లను తీయలేక ఇబ్బంది పడిన భారత బౌలర్లు శ్రీలంకతో (IND vs SL) రెండో టెస్టును డ్రా చేసుకోవాల్సి వచ్చింది. దీంతో ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్‌లో పర్సంటేజీ కూడా తగ్గిపోయింది. ప్రత్యర్థికి ఫాలో ఆన్ ఇచ్చినా గిల్ సరైన వ్యూహాలను అమలు చేయలేదని విమర్శలు వచ్చాయి. లంక బ్యాటర్ సోనాల్ దినుషను అడ్డుకోవడంలో టీమ్‌ఇండియా విఫలమైందని భారత మాజీ క్రికెటర్ మహ్మద్ కైఫ్ ఆక్షేపించాడు. అదే విరాట్ కోహ్లీ అక్కడుంటే పరిస్థితి మరోలా ఉండేదని వ్యాఖ్యానించాడు.

"టెస్టు క్రికెట్ ఆడటం అందరికీ సూట్ కాదు బాస్.. ఇది సుదీర్ఘమైన ఫార్మాట్ గేమ్. బౌలింగ్ ఎటాక్‌ను కొనసాగిస్తూనే ఉండాలి. ఎందుకో.. ఈ మ్యాచ్‌లో విరాట్ కోహ్లీ ఆడుంటే తప్పకుండా భారత్ విజయం సాధించేదేమో అనిపించింది. నిరంతరం అప్రమత్తంగా ఉంటూ జట్టు సహచరుల్లో ఉత్సాహాన్ని నింపుతాడు. ఈ మ్యాచ్‌లో బౌలింగ్ చేస్తూ ఉంటే చాలు ఫలితం దక్కుతుందని.. బంతి బాగా తిరుగుతుంది కాబట్టి వికెట్ వస్తుందనుకొని తేలిగ్గా తీసుకున్నట్టుగా అనిపిస్తోంది. మన ఎనర్జీ లెవల్స్ తగ్గుతున్నప్పుడు విరాట్ ఉండుంటే.. ప్రతి ఒక్కరినీ ఉత్సాహపరిచేవాడు. ప్రత్యర్థులపై మాటలతో రెచ్చగొట్టేందుకు ప్రయత్నిస్తోన్న సర్ఫరాజ్, యశస్వి జైస్వాల్‌ను ఇంకా ప్రోత్సహించేవాడు. సోనాల్‌నూ కోహ్లీ వెంటాడేవాడు. కానీ, ఈ జట్టులోని ఆటగాళ్లు మాత్రం కుమార వంటి లోయర్ ఆర్డర్ బ్యాటర్‌ను రెచ్చగొట్టేందుకు ప్రయత్నించడం చూశాం" అని కైఫ్ అన్నాడు.

**ఒత్తిడి పడలేదు..**

"ఈ మ్యాచ్‌లో సోనాల్‌నే ఔట్ చేయాలి. అతడు చాలా ఆత్మవిశ్వాసంతో కనిపించాడు. లాహిరు కుమారతో తమ భాషలో 'వాళ్ల ముఖాలు చూడు' అని భారత ప్లేయర్లను అంటున్నట్లుగా ఓ వీడియో చూశా. ఓ వైపు టెయిలెండర్లు మాత్రమే ఉన్నా.. సోనాల్ మాత్రం ఒత్తిడి లేకుండా ప్రశాంతంగా కనిపించాడు. మనవాళ్ల స్లెడ్జింగ్ అసలు అతడిపైనే జరిగినట్లు అనిపించలేదు. ఎంతసేపూ కుమార, ప్రభాత్ జయసూర్యనే లక్ష్యం చేసుకోవడం కనిపించింది. అలాగే, పెద్ద ప్లేయర్ అతడికి దగ్గరగా తిరుగుతూ మానసికంగానూ ఇబ్బంది పెట్టే ప్రయత్నం చేయలేదు. మొన్నటి వరకూ విరాట్ కోహ్లీ, రోహిత్, అశ్విన్, ధోని.. ఇలాంటి ప్లేయర్లను దగ్గరగా చూస్తే ప్రత్యర్థి కుర్రాళ్లు కాస్త కంగారు పడేవారు. ఒత్తిడి పెంచుకొనేవాళ్లు. ఎందుకో.. ఈసారి అలాంటి పరిస్థితిని మనం కోల్పోయామని అనిపించింది" అని కైఫ్ వెల్లడించాడు.

## ఇవిగో 'డ్రా' తాలూకు గుర్తులు.. పంత్ – పడిక్కల్ ఫొటోలు వైరల్!




శ్రీలంకతో రెండు టెస్టుల్లోనూ శతకాలు బాది ప్లేయర్ ఆఫ్ ది సిరీస్‌గా నిలిచాడు దేవదత్ పడిక్కల్. సాయి సుదర్శన్ స్థానంలో పడిక్కల్ వన్‌డౌన్ బ్యాటర్‌గా వచ్చాడు. ఇటు ఫీల్డింగ్‌లోనూ అద్భుతమైన ప్రదర్శన ఇచ్చాడు. గంటలతరబడి ఫీల్డింగ్ చేయడంతో తన వీపుపై సూర్యుడు 'టాటూ' వేశాడంటూ పేరు, జెర్సీ నంబర్ ఉన్న ఫొటోను షేర్ చేశాడు.

**అది నా గాయం..**

శ్రీలంకతో రెండో టెస్టులో గాయంతో ఒక దశలో రిషభ్ పంత్ ఒక రోజు మైదానం లోకే రాలేదు. అతడికి బదులు ధ్రువ్ జురెల్ బాధ్యతలను నిర్వర్తించాడు. బ్యాటింగ్ చేస్తుండగా లంక బౌలర్లు సంధించిన షార్ట్ పిచ్ బంతులను ఎదుర్కొనే క్రమంలో పంత్ చేతులు, భుజానికి గాయాలు అయ్యాయి. అయితే, హాఫ్ సెంచరీతో రాణించిన అతడు.. చివరి రోజున ఫీల్డ్‌లోకి దిగాడు. ఈ క్రమంలో తనకు అయిన గాయాన్ని చూపిస్తూ ఇన్‌స్టాలో ఫొటోలను షేర్ చేసుకున్నాడు.

## మహిళల క్రికెట్‌లో అనయ బంగర్‌ను ఎలా ఆడిస్తారు?: కాప్ తీవ్ర అభ్యంతరం



అనయ బంగర్ .. లింగ మార్పిడి చేయించుకుని అమ్మాయిగా మారిన ఓ అబ్బాయి. భారత మాజీ క్రికెటర్ సంజయ్ బంగర్ కుమార్తె. అంతకుముందు దేశవాళీలో సర్ఫరాజ్ ఖాన్, అభిషేక్ శర్మ వంటి యువ భారత ఆటగాళ్లతో కలిసి ఆడిన సంగతి తెలిసిందే. ఇప్పుడు మహిళగా మారిన తర్వాత తన క్రికెట్ కలను నెరవేర్చుకొనేందుకు ఐసీసీపైనే పోరాటం చేసింది. అయితే, ఆస్ట్రేలియా క్రికెట్ సంఘం ఆమెకు మద్దతుగా నిలిచింది. మహిళల బిగ్‌బాష్ లీగ్‌లో ఆడేందుకు అవకాశం ఇచ్చింది. కానీ, ఇప్పుడు అనయ అవకాశాలకు గండిపడేలా ఉంది. దానికి కారణం దక్షిణాఫ్రికా ప్లేయర్ మరిజెన్నె కాప్ తీవ్ర స్థాయిలో అభ్యంతరం వ్యక్తం చేయడం. ఈ మేరకు తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీగా పెట్టడం గమనార్హం.

"ఇలాంటి నిర్ణయం అత్యంత దారుణం. అనుమతి ఇవ్వడానికి వీల్లేదు. ట్రాన్స్‌జెండర్ క్రికెటర్ మహిళల బిగ్‌బాష్‌ను ఆడేందుకు ఎలా వీలవుతుంది" అని కాప్ అభ్యంతరం వ్యక్తం చేసింది. మార్చి 2027లో మొదలయ్యే మహిళల బిగ్‌బాష్‌లో ఆడతానని ఇటీవల అనయ ప్రకటించిన తర్వాత కాప్ ఈ మేరకు పోస్టు చేసింది. ఆసీస్ బోర్డు నిర్ణయంపై వ్యతిరేకత వ్యక్తం చేసిన తొలి క్రికెటర్ కాప్. ఈ దక్షిణాఫ్రికా స్టార్ ఆల్‌రౌండర్ అయిన ఆమె బిగ్‌బాష్‌లోనూ ఆడుతోంది.

**ఐసీసీ అనుమతి లేదు..**

ఐసీసీ (ICC) 2023 నుంచి అమలు చేస్తోన్న పాలసీ ప్రకారం.. ట్రాన్స్‌జెండర్ మహిళలకు అంతర్జాతీయ మహిళా క్రికెట్ ఆడేందుకు అనుమతి లేదు. కానీ, ఆస్ట్రేలియా దేశవాళీ నిబంధనలు ఇందుకు పూర్తిగా భిన్నం. కమ్యూనిటీ, ప్రిమియర్ క్రికెట్ ఆడేందుకు అనయకు అవకాశం కల్పించింది. అర్హత ప్రక్రియను అనుసరించే అనుమతి ఇచ్చినట్లు ఇటీవల ఓ ప్రకటనలో తెలియజేసింది. కాప్ విమర్శల నేపథ్యంలో.. ఇప్పుడు ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో చూడాలి మరి!

## మాజీ క్రికెటర్ రహానే పేరిట స్కాలర్‌షిప్

భారత మాజీ క్రికెటర్ అజింక్య రహానేకు గొప్ప గౌరవం దక్కింది. ఆయన పేరిట ఓ స్కాలర్‌షిప్‌ను ఇచ్చేందుకు ముంబయి క్రికెట్ అసోసియేషన్ ) నిర్ణయం తీసుకుంది. ముంబయి అపెక్స్ కౌన్సిల్ మీటింగ్‌లో పలు కీలక అంశాలపై చర్చ జరిగింది. పురుష, మహిళా క్రికెటర్లకు వార్షిక కాంట్రాక్ట్‌లను అందించనుంది. అలాగే రహానే పేరిట అర్హులైన ఆటగాళ్లకు స్కాలర్‌షిప్‌ను ఇవ్వనుంది.

**మూడు గ్రేడ్‌లుగా..**

ముంబయి క్రికెట్ అసోసియేషన్ తరఫున 22 మంది క్రికెటర్లకు వార్షిక కాంట్రాక్ట్‌లు దక్కాయి. ఇందులో 14 మంది పురుషులు, 8 మంది మహిళా క్రికెటర్లు ఉన్నారు. గ్రేడ్ - Aలో రూ. 12 లక్షలు, గ్రేడ్ B ప్లేయర్లకు రూ.8 లక్షలు, గ్రేడ్ C వారికి రూ.6 లక్షలు అందనుంది. గ్రేడ్‌ఏలో సిద్దేశ్, షామ్స్ ములానికి అవకాశం వరించింది.

**యువ క్రికెటర్ల కోసం..**

క్షేత్ర స్థాయిలో యువ క్రికెటర్లకు ప్రోత్సాహం అందించేందుకు స్కాలర్‌షిప్ ఫండ్‌కు ఎంసీఏ అపెక్స్ కౌన్సిల్ ఆమోద ముద్ర వేసింది. ఇటీవల అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికిన అజింక్య రహానే పేరిట ఈ స్కాలర్‌షిప్‌ను ఇవ్వనుంది. ముంబయి జట్టుకు రహానే సారథిగా రంజీ ట్రోఫీలను అందించిన చరిత్ర ఉంది. ఎంసీఏ మాజీ ప్రెసిడెంట్ శరద్ పవార్ భాగస్వామ్యం అందించనున్న ఈ స్కాలర్‌షిప్ ప్రోగ్రామ్‌కు రహానే పేరు పెట్టినట్లు ముంబయి క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు అజింక్య నాయక్ తెలిపారు.

PRINTER, PUBLISHER AND OWNED BY SHANKARAGALLU VENKATESULU, AND PRINTED AT FLAT NO 402,4 FLOOR RADHAMADHAV NILAYAM,BESIDE SURYAVAMSHIGARDEN2,SURYAVAMSHI COLONY, PEDDA AMBERPET., RANGAREDDY, TELANGANA 501505. EDITOR : SHANKARAGALLU VENKATESULU. Printing Press M/S. TRIPURA PUBLICATIONS HOUSE NO.: 58518, REVENUE WARD NO: 05, ASHOK NAGAR COLONY, KAMAREDDY (TOWN & POST), MANDAL, TELANGANA 503111. Email: anantha janasakshi2019@gmail.com, Cell : 9533633213, RNI REGD NO : TGTEL/26/A4945